గురువారం
22-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 240
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

వక్ఫ్ బోర్డులో ఇతరులకు స్థానం సబబే

సుప్రీంలో కేంద్రం వాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కులు ఉండవని వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం సమర్థించింది. వక్ఫ్ చట్టానికి సవరణలపై బుధవారం రెండవ రోజు సుప్రీం కోర్టులో వాదనలు కొనసాగాయి. సీజేఐ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ నేతృత్వ ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. వక్ఫ్ అన్నది ఇస్లామిక్ కాన్సెప్ట్ అయినప్పటికీ ఇస్లాంలో కీలకభాగం కాదని, పరోపకారమే

- మిగతా 2 లో

ఆ ఇద్దరికీ రూ.142 కోట్ల లబ్ధి: ఈడీ

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసు లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల ద్వారా వారు రూ.142 కోట్లు లబ్ధి పొందారని ఆరోపించింది. ఈ మేరకు బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో ఈడీ తన వాదనలు వినిపించింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు వాదనలు వినిపించారు. నవంబరు 2023లో నేషనల్ హెరాల్డ్‌తో

- మిగతా 2 లో

అలీ ఖాన్, అబ్దుల్ సత్తార్‌కు ఊరట

న్యూఢిల్లీ: పీఎఫ్ఐ మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్‌కు సుప్రీంకోర్టు బుధవారం బెయిలిచ్చింది. సిద్ధాంతాల కోసం ఎవరినీ జైల్లో పెట్టలేమని వ్యాఖ్యానించింది. జైల్లో ఉన్న వ్యక్తికి విచారణ హక్కులు ఉంటాయని పేర్కొంది. 2022లో ఆర్ఎస్ఎస్ కార్యకర్త శ్రీనివాసన్ హత్యకు కుట్ర కేసులో అబ్దుల్ సత్తార్ నిందితుడు. హత్యలో ప్రత్యక్ష పాత్ర లేనప్పటికీ, పీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా, కేడర్ నియామకాలు, సాయుధ శిక్షణలు నిర్వహించినట్లు ఆయనపై ఎన్ఐఏ ఆరోపణలు చేసింది. చట్టాన్ని ధిక్కరించిన చరిత్ర ఆయనకున్నట్లు పేర్కొంది. అలాంటి 71 సందర్భాలు ఉన్నాయని ఎన్ఐఏ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ధరల నియంత్రణకు ఏంచేయాలో తెగ ఆలోచిస్తున్నారు!

భద్రతాబలగాలు X మావోయిస్టులు

భీకర ఎన్‌కౌంటర్

చత్తీస్‌గఢ్ నారాయణ్‌పూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

అగ్రనేత నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టుల మృతి

అనేక మందికి గాయాలు

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టులకు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చత్తీస్‌గఢ్, నారాయణపూర్ జిల్లాలోని అబూజ్ మడ్‌లో భద్రతా దళాలతో జరిగిన భీకర ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (70) మృతి చెందారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు నేలకొరిగారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ.1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. కాగా ఎదురుకాల్పుల్లో ఒక పోలీస్ సహాయకుడు మృతి చెందారు. ఇంకా అనేకమంది మావోయిస్టులకు గాయాలైనట్లు సమాచారం. భద్రతా బలగాల కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత,

నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధ్రువీకరించారు. మాఢ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో బీజాపూర్, నారాయణపూర్, దంతేవాడ డీఆర్‌జీ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఎదురుపడటంతో రెండు పక్షాల మధ్య కాల్పులు జరిగినట్లు తెలిసింది. ఈ ఎన్ కౌంటర్ లో మొత్తం 27 మంది మవోయిస్టులతో పాటు పోలీసు సహాయకుడు ఒకరు మృతి చెందినట్లు చత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ వర్మ తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన జవానుకు ప్రాణాపాయం లేదని వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాల్పులు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని తెలిపారు.

మవోయిస్టు అగ్రనేత మృతి

మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు పై రూ.కోటిన్నర రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. ఇటీవల లొంగిపోయిన కొందరు మావోలు నంబాల కేశవరావును గుర్తించినట్లు సమాచారం. గణపతి రాజీనామాతో పార్టీకి సుప్రీం కమాండర్ బాధ్యతలను నంబాల కేశవరావు నిర్వహించారు. కేశవరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా జియ్యన్నపేట. తూర్పు గోదావరి, విశాఖలో మావోయిస్టు పార్టీలో పనిచేశారు. పీపుల్స్‌వార్ వ్యవస్థాపకుల్లో నంబాల కేశవరావు ఒకరు. మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ అధిపతిగా నంబాల కేశవరావు పనిచేశారు.

మాస్టర్ మైండ్...

వరంగల్ ఆర్ఈసీలో నంబాల కేశవరావు ఇంజినీరింగ్ చదివారు. ఆయన తండ్రి ఉపాధ్యాయుడు. 1984లో ఎంటెక్ చదువుతూ పీపుల్స్ వార్ సిద్ధాంతాల పట్ల నంబాల కేశవరావు ఆకర్షితులయ్యారు. గెరిల్లా యుద్ధం, ఐఈడీ పేలుడు పదార్థాల వినియోగంలో మావోయిస్టు పార్టీకి మూలస్తంభంగా ఉన్నారు. 1987లో బస్తర్ అడవుల్లో మాజీ ఎల్టీటీఈ, మాజీ సైనికుల వద్ద శిక్షణ తీసుకున్నారు. 2018 నవంబర్‌లో గణపతి రాజీనామా తర్వాత మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నంబాల బాధ్యతలు చేపట్టారు. 2010లో చత్తీస్‌గఢ్‌లో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతి

- మిగతా 2 లో

ఇవి ప్రభుత్వ హత్యలు: సీపీఐ

జుడిషియల్ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ: మావోయిస్టుల విముక్త భారత్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోందని సీపీఐ ఆవేదన వ్యక్తం చేసింది. మావోయిస్టుల నెపంతో ఆదివాసీలను కిరాతకంగా చంపేస్తున్నారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని మండిపడింది. చత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా మావోయిస్టు అగ్ర నాయకుడితో పాటు 26 మంది మృతి చెందిన ఎన్‌కౌంటర్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ఖండించింది. చట్టబద్ధంగా అరెస్టులు చేయడం మానేసి రక్తం చిందించడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించింది. సాయుధ శక్తి దుర్వినియోగమవుతోందని ఆందోళన వ్యక్తంచేసింది. ప్రజాస్వామ్య నిబంధనలు, రూల్ ఆఫ్ లాపై అధికారుల చిత్తశుద్ధి ప్రశ్నార్థకమని సీపీఐ పేర్కొంది. నాయకుడి గురించి ఇంటెలిజెన్స్ సమాచారం ఉంటే ఎందుకు అరెస్టు చేయలేదు? రాజ్యాంగం ప్రకారం ఎందుకు చర్యలు తీకోలేదు. న్యాయ ప్రక్రియను ఎందుకు విస్మరించారు? అని ప్రశ్నించింది. తాజా ఘటనతో పాటు ఆపరేషన్ కగార్‌పై స్వతంత్రంగా జుడిషియల్ విచారణ జరిపించాలని

- మిగతా 2 లో

మావోయిస్టులతో

శాంతి చర్చలు జరపండి

సీపీఐ నేత చాడ వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా... మావోయిస్టుల వామపక్ష భావజాలాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ కగార్' పేరుతో విచ్చలవిడిగా బూటకపు ఎన్‌కౌంటర్‌లతో మావోయిస్టులను అంతమొందిస్తున్నారని అన్నారు. ఉగ్రవాదుల కంటే దారుణంగా మన దేశ పౌరులైన మావోయిస్టులను చంపేస్తున్నారని మండిపడ్డారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా చర్చలు జరపకుండా మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఎదురుకాల్పుల పరంపర

- మిగతా 2 లో

సమన్వయంతో పనిచేయండి

- ధాన్యం తడవకుండా చూడండి
- లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు
- వర్షాల హెచ్చరికలతో సీఎస్‌కు రేవంత్ ఆదేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. కాటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ (ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి)ని ఆదేశించారు.

ఇదిలా ఉండగా.... తెలంగాణ రాష్ట్రంలో ఈ నెలాఖరుకే రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో అన్ని జిల్లాలకు ముందస్తు చర్యలపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మార్గదర్శకాలను విడుదల చేశారు. 2024, ఆగస్టులో భారీ వర్షాలకు జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, ముందస్తుగానే ఈసారి 12 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఒక్కో టీమ్ లో తెలంగాణ స్పెషల్ పోలీస్ కు చెందిన 100 సుశిక్షితులైన పోలీసులు ఉంటారని, ఈ బృందాలను

- మిగతా 2 లో

మావోయిస్టులను మట్టుబెట్టడం

అప్రజాస్వామికం

కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర- హైదరాబాద్: శాంతి చర్చలకు సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా ఎదురుకాల్పులు జరుపుతూ మట్టుబెట్టడం అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌లో

- మిగతా 2 లో

దేశానికే వన్నెతెచ్చిన

మహానేత రాజీవ్‌గాంధీ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆర్థిక సరళీకృత విధానాలతో దేశాన్ని బలమైన ఆర్థిక దేశంగా నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో భాగస్వామ్యం కల్పించారని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సచివాలయం ఎదురుగా ఉన్న అయన విగ్రహానికి సీఎం పుష్పాంజలి ఘటించారు. పహల్గాం ఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌కు బుద్ధి

- మిగతా 2 లో

గొప్ప అభ్యుదయవాది సుకుమారన్

సంతాప సభలో వక్తల నివాళి

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశంలో సాంస్కృతిక సహకారం ద్వారా శాంతిని పెంపొందించడానికి తీవ్రంగా కృషి చేసిన గొప్ప అభ్యుదయవాది టి.ఎస్. సుకుమారన్ అని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా కొనియాడారు. భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న సుకుమారన్ విశాఖపట్నంలోని తన స్వగృహంలో మృతి చెందడంపై అజీజ్ పాషా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్‌భవన్లో బుధవారం ఇస్కఫ్, తెలంగాణ రాష్ట్ర సమితి సంయుక్తంగా సుకుమారన్ సంతాప సభ ఏర్పాటు చేసింది. అజీజ్‌తో పాటు ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు రేఖల గోపాల్, కేవీఎల్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, ఇస్కఫ్ రాష్ట్ర నాయకులు ఎండి. మహబూబ్ ... సుకుమారన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. దోపిడీ, వివక్షకు గురైన ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం శాంతియుత ఉద్యమాలు చేసిన ప్రగతిశీల నేత టి.ఎస్. సుకుమారన్ అని పాషా అన్నారు. గోపాల్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా జాతీయ స్థాయిలో ఇస్కఫ్ బలోపేతానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి టి.ఎస్. సుకుమారన్ అని అన్నారు. కేవీఎల్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఇస్కఫ్ చేసిన అనేక ఉద్యమాలలో టి.ఎస్. సుకుమారన్ క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సభకు హాజరు కాలేకపోయిన

- మిగతా 2 లో

హైదరాబాద్‌లో భారీ వర్షం

2లో

స్వతంత్ర దేశంగా పలస్తీనా

ఇజ్రాయిల్ మారణహోమం ఆగాలి: కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల డిమాండ్

ఏథెన్స్: గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ దురాక్రమణ, దిగ్బంధకాండ, సైనిక దస్సాహసం, మారణహోమం ఆపాలని, పలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని గ్రీస్, ఆస్ట్రేలియా, డెన్మార్క్ స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీలు, రొమేనియా సోషలిస్టు పార్టీ సహా కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల సంయుక్త ప్రకటన పిలుపునిచ్చింది. ప్రపంచం కళ్ల ఎదుట అమాయక పలస్తీనియన్ల రక్తం పారిస్తున్నారంటూ ఇజ్రాయిల్ దురాక్రమణను ఆక్షేపించింది. పలస్తీనియన్లపై ఇజ్రాయిల్ తాజా యుద్ధ నేరాలను తీవ్రంగా ఖండించింది. దశాబ్దాలుగా సాగుతున్న ఇజ్రాయిల్ దురాక్రమణ తక్షణమే ఆపాలని, పలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని డిమాండ్ చేసింది. పలస్తీనా భూభాగంలో ఆక్రమణలు తొలగించాలని, ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న పలస్తీనియన్లను విడుదల చేయాలని, ఐరాస తీర్మానం 194 ప్రకారం శరణార్థులను అప్పగించాలని డిమాండ్ చేసింది. పలస్తీనా ప్రజలకు అంతర్జాతీయ సంఘీభావానికి సెల్యూట్ చేస్తున్నట్లు వెల్లడించింది. అనేక దేశాల మద్దతును స్వాగతించింది. గాజాలో మారణహోమానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని యువతకు, కార్మికులకు పిలుపునిచ్చింది. నిర్మాణాత్మకంగా పలస్తీనియన్ల పోరాటానికి బలం చేకూర్చాలని కోరింది. ఉద్యమ బాటలో నడుద్దాం! స్వతంత్ర పలస్తీనాను గుర్తిద్దాం! అని పిలుపునిచ్చింది. 'అమెరికా, నాటో, యూరోపియన్ యూనియన్‌తో పాటు బూర్జువ ప్రభుత్వాల అండదండలతో గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ నరమేధం సృష్టిస్తోందని, పిల్లలు, వృద్ధులు సహా వేలాది మందిని చంపిందని, లక్షల మందికి ఆహారం, తాగునీరు, మందులు లేకుండా చేసిందని, విద్యుత్ నిలిపివేసిందని, ఆసుపత్రులు ధ్వంసం చేసిందని, లక్షల మంది సొంత ఇళ్లు, ఊరు వదిలి వెళ్లిపోయేలా చేసిందని కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇంతటి అమానవీయత జరుగుతుంటే ఎలా మౌనంగా ఉండగలుగుతున్నారని ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చేవారిని నిలదీశాయి. పలస్తీనియన్ల హక్కులు, మాతృభూమి పరిరక్షణ పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. పలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ దురాక్రమ, హత్యాకాండ, నిర్బంధాలను తీవ్రంగా ఆక్షేపించాయి. ఇజ్రాయిల్ తక్షణమే యుద్ధ నేరాలు ఆపాలని, పలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు ఐక్యంగా డిమాండ్ చేశాయి.

శాంతి, సుస్థిరతకు కట్టుబడదాం

వాణిజ్యం, సహకారం పెంచుకుందాం: చైనా, పాక్

అఫ్ఘాన్‌లోకి సిపెక్ విస్తరణకు అంగీకారం

బీజింగ్/ఇస్లామాబాద్: ప్రాదేశిక శాంతి, సుస్థిరతాభివృద్ధికి కట్టుబడాలని చైనా, పాకిస్థాన్ నిర్ణయించాయి. దౌత్య బంధాన్ని, వాణిజ్యాన్ని, సహకారాన్ని మరింత పెంచుకోవాలన్న అవగాహనకు వచ్చాయి. చైనా-పాక్ ఆర్థిక కారిడార్ సిపెక్‌ను అఫ్ఘానిస్థాన్ వరకు విస్తరించేందుకు అంగీకరించాయి. చైనా, పాకిస్థాన్ విదేశాంగ మంత్రులు వాంగ్ యీ, ఇషాక్ దార్ బీజింగ్‌లో సమావేశమై ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. దౌత్యపరమైన అంశాలు, అంతర్జాతీయ పరిణామాలు, భారత్-పాక్ మధ్య ఘర్షణ వంటి అనేక అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నాలను వాంగ్ యీ స్వాగతించారు. ప్రాదేశిక శాంతి, సుస్థిరత దిశగా నిర్మాణాత్మక కార్యాచరణకు కృషి చేయాలని సూచించారు. పాకిస్థాన్‌కు తమ మిత్రబంధాన్ని, వాణిజ్య బంధాన్ని, సహకారాన్ని బలపర్చుకునేందుకు చైనా కట్టుబడి ఉందని చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు పెంచేందుకు చైనా సిద్ధమన్నారు. కలిసి సవాళ్లు అధిగమిద్దామన్నారు. ప్రాదేశిక సమగ్రత పరిరక్షణకు పాకిస్థాన్‌కు ఎప్పుడు అండగా నిలుస్తామన్నారు. పాకిస్థాన్‌తో అన్ని వాతావరణాలకు అనుకూలమైన వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని పెంచుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు వాంగ్‌యీ తెలిపారు. చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ అప్‌గ్రేడెడ్ వర్షన్ సృష్టికి... పరిశ్రమలు, వ్యవసాయం, ఇంధనం, ఖనిజాలు, మానవ వనరుల అభివృద్ధి, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, భద్రతా చర్యల్లో సహకారానికి కట్టుబడి ఉన్నట్లు వాంగ్ యీ తెలిపారు. చైనాతో సౌభ్రాతృత్వాన్ని పాకిస్థాన్ ఎంతో గౌరవిస్తుందని దార్ చెప్పారు. 'వన్ చైనా'కు మద్దతు ప్రకటించారు. దేశ ప్రయోజనాల పరిరక్షణకు అండగా నిలుస్తామన్నారు. తమ దేశంలోని చైనా సిబ్బంది, ప్రాజెక్టులు, వ్యవస్థల భద్రతకు హామీ ఇవ్వడం కోసం చేయగలిగినదంతా చేస్తామని దార్ అన్నారు. ప్రాదేశిక సహకారం, బహుపాక్షిక యంత్రాగాల సమన్వయాన్ని పెంచుకోవాలని ఇద్దరు మంత్రులు నిర్ణయించారు. కాగా, చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సిపెక్)ను అఫ్ఘానిస్థాన్‌లోకి విస్తరించాలని ఇషాక్ దార్, వాంగ్ యీ నిర్ణయించారు. అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీతో భేటీ క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇదిలావుంటే, 60 బిలియన్ డాలర్లతో చేపట్టిన సిపెక్‌ను భారత్ వ్యతిరేకిస్తోంది. ఈ ప్రాజెక్టులో పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం కూడా ఉండటమే భారత్ వ్యతిరేకతకు కారణం. చైనా నుంచి బలూచిస్థాన్‌లోని గదర్ వరకు సాగే సిపెక్ కీలకమైంది. చైనా నౌకలు పర్షియన్ సింధు శాఖ ద్వారా ఎగుమతి, దిగుమతులు నిర్వహిస్తాయి. ఆ మార్గాన్ని కాపాడుకోవడానికి సిపెక్‌లో భాగంగా గదర్ పోర్టు నిర్మిస్తున్నారు. ఈ పోర్టు ద్వారా చైనా నౌకలు మలక్కా జల సంధిపై పెద్దగా ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

చైనా లిజియన్-1 వై17 ప్రయోగం విజయవంతం

జిక్వాన్: చైనా మరొక వాణిజ్య రాకెట్‌ను బుధవారం విజయవంతంగా ప్రయోగించింది. లిజియన్-1 వై17 కెరియర్ రాకెట్ ద్వారా ఆరు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.05 గంటలకు వాయువ్య చైనాలోని కమర్షియల్ ఎరోస్పేస్ ఇన్నోవేషన్ పైలట్ జోన్ నుంచి ఈ రాకెట్ నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లింది. ఆరు ఉపగ్రహాలను నిర్దేశిత కక్షకు చేర్చింది. లిజియన్-1 సిరీస్‌లో ఏడవ ఫైట్ మిషన్ విజయవంతం అయినట్లు చైనా అంతరిక్ష పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వెల్లడించారు.

అలీ ఖాన్, అబ్దుల్ సత్తార్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

తరపున న్యాయవాది వెల్లడించారు. ఈ ఆరోపణలను అబ్దుల్ సత్తార్ తరపు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి తోసిపుచ్చారు. 'సమ్మెలు, హర్తాళ్లు చేయడం సిద్ధాంతాలకు సంబంధించిన అంశాలు. ఆ వ్యవహారాలన్నింటిలో అబ్దుల్ సత్తార్‌ను కేరళ హైకోర్టు విచారించింది. అన్ని కేసుల్లో ఆయనకు బెయిల్ వచ్చింది' అని న్యాయవాది ఆదిత్య వాదించారు. వాదనల అనంతరం అబ్దుల్ సత్తార్‌కు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. ఒక సిద్ధాంతాన్ని అనుసరిస్తున్న వారిని జైల్లో పెట్టాలనే ధోరణి ఈ మధ్య గమనిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. కొత్త నేరాలకు అవకాశం లేకుండా సత్తార్‌ను కస్టడీలో ఉంచినట్లు ఎన్‌ఐఏ చెప్పగా... ఈ విధానంతోనే సమస్య అని వ్యాఖ్యానించింది. 'వ్యక్తిని జైల్లో పెట్టడమే మన విధానం. విచారణ జరిపించిన తర్వాత శిక్ష విధించాలే కానీ ప్రక్రియనే శిక్షగా మార్చకూడదు' అని జస్టిస్ భుయన్ అన్నారు. శ్రీనివాసన్ హత్య కేసులో మొత్తం 44 మంది నిందితులు ఉండగా, వారిలో సత్తార్ సహా తొమ్మిది మందికి మాత్రమే బెయిల్ లభించలేదు. మిగతా అందరికీ గతేడాది జూన్‌లో బెయిల్ వచ్చిన విషయం విదితమే.

వక్ఫ్ బోర్డులో ఇతరులకు స్థానం సబబే

(మొదటిపేజీ తరువాయి)

దీని ఉద్దేశమని, ఇలాంటిది అన్ని మతాల్లో ఉంటుందన్నారు. వక్ఫ్... ప్రాథమిక హక్కు కాదని వాదించారు. వక్ఫ్ బోర్డులు లౌకిక విధులు నిర్వర్తిస్తాయని, ముస్లింయేతరులకు అందులో స్థానం కల్పించడం వల్ల మతపరమైన కార్యకలాపాలకు విఘాతం కలగదన్నారు. పరోపకారం కోసం ఆచరణలో ఉన్న వక్ఫ్ బోర్డులో ముస్లింయేతరులకు స్థానం కల్పించడాన్ని మెహతా సమర్థించారు. కేవలం ఇద్దరు సభ్యులు ఉండటం వల్ల జరిగే మార్పు ఏమీ ఉండదు. మతపరమైన కార్యకలాపాలకు విఘాతం కలగదని వాదించారు. కొందరు పిటిషన్లు వేసి... ముస్లింలందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకోవడం సబబు కాదన్నారు. సుదీర్ఘ సమాలోచనల తర్వాతే వక్ఫ్ చట్టాన్ని సవరించినట్లు తెలిపారు. 140 కోట్ల మంది పౌరుల ఆస్తుల సంరక్షకునిగా ప్రభుత్వం ఉందని, వక్ఫ్‌పై తప్పుడు ప్రచారం జరుగుతోందని మెహతా అన్నారు. వక్ఫ్ బై యూజర్ అంటే సుదీర్ఘ కాలం వినియోగించడం వల్ల ఎవరికో చెందిన ఆస్తిపై మీకు హక్కు లభించడమని కోర్టుకు వివరించారు. సంబంధిత ఆస్తి ప్రభుత్వానిది అవునో కాదో పరిశీలించుకునే అధికారం ప్రభుత్వానికి ఉండదా? అ పనినే రెవెన్యూ అధికారులు చేస్తారని మోహతా అన్నారు. దీనికి సీజేఐ బీఆర్ గవాయ్ స్పందిస్తూ 'కలెక్టర్ దర్యాప్తు చేశారంటే ఆ ఆస్తి వక్ఫ్‌కు చెందకుండా పోతుందన్నట్లుగా చిత్రీకరించారు. దర్యాప్తు పూర్తి అయితే సంబంధిత ఆస్తి ప్రభుత్వ వశమవుతుందని భావిస్తున్నారు' అని అన్నారు. దీనికి మెహతా బదులిస్తూ 'అలా జరిగినప్పటికీ సంబంధిత ఆస్తి యాజమాన్యం కోసం ప్రభుత్వం టైటిల్ దావా వేయాల్సి ఉంటుంది' అని చెప్పారు. ప్రభుత్వ వాదన అనంతరం విచారణను సీజేఐ గురువారానికి వాయిదా వేశారు.

ఆ ఇద్దరికీ రూ.142 కోట్ల లబ్ధి

(మొదటిపేజీ తరువాయి)

ముడిపడి ఉన్న రూ.751.9 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసే వరకూ ఆ నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సోనియా, రాహుల్ అనుభవించారని కోర్టుకు తెలిపారు. నేషనల్ హెరాల్డ్ పేపర్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సోనియా, రాహుల్ గాంధీని ఈడీ గతంలో విచారించింది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపారన్న ఫిర్యాదు మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేపట్టాయి. అయితే, సీబీఐ విచారణ అర్ధాంతరంగానే నిలిచిపోగా... ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతూ వస్తోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కి చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించి... నోటీసులు జారీ చేసింది. ఈడీ ఇప్పటి వరకు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్, యంగ్ ఇండియాకు చెందిన దాదాపు రూ.751.9కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంది. ఆయా ఆస్తుల్లో అద్దెకు ఉంటున్న వారు తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకునే ప్రక్రియ చేపట్టినట్లు చెప్పింది. నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను 1938లో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించారు. దీన్ని అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ అంటే ఏజేఎల్ ప్రచురించింది. 2008లో ఆర్థిక సంక్షోభం తర్వాత ఈ వార్తాపత్రిక మూసివేశారు. అయితే, ఇక్కడే ఈ వివాదం ప్రారంభమైంది. దీని తర్వాత 2010లో, యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ ఏర్పడింది. దీనిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ 38-38శాతం వాటాను కలిగిఉన్నారు. ఈ కేసులో బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి 2012లో వైఐఎల్ రూ.రెండు వేలకోట్లకుపైగా విలువైన ఏజేఎల్ ఆస్తులను కేవలం రూ.50 లక్షలకు కొనుగోలు చేసిందని... ఇది మోసమని ఆరోపించారు. ఇక ఈడీ చార్జిషీట్‌పై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మరికొందరు నేతలపై చార్జిషీట్ దాఖలు చేయడం అనేది ప్రధానమంత్రి, హోంమంత్రి ప్రతీకార రాజకీయాలకు పాల్పడడం, బెదిరింపులకు ప్రయత్నించడమే తప్ప మరొకటి కాదన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ దాని నాయకత్వం మౌనంగా ఉండదు. సత్యమేవ జయతే! అంటూ ట్వీట్ చేశారు.

భీకర ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఘటనకు సంబాల కేశవరావు సూత్రధారిగా ఉన్నారు. ఇటీవల చత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కరేగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో భద్రతా బలగాలు 31 మంది మావోయిస్టులను హతమార్చిన విషయం తెలిసిందే వీరిలో 16 మంది మహిళలు ఉన్నారు.

ప్రధాని మోదీ, అమిత్‌షా స్పందన

చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను మోదీ ప్రశంసించారు. 'మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి... ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని తెలిపారు. అమిత్ షా స్పందిస్తూ... నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఓ మైలురాయి విజయం సాధించామని... నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు 27 మంది మావోయిస్టులను మట్టుబెట్టాయని పేర్కొన్నారు. ఇందులో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, అగ్ర నేత, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన సంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సైతం ఉన్నారని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నేతను దళాలు మట్టుబెట్టడం ఇదే తొలిసారని ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా భద్రతా బలగాలను అభినందించారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ ద్వారా 54 మంది అరెస్ట్ అయ్యారని... 84 మంది నక్సల్స్ లొంగిపోయారన్నారు. మార్చి 31, 2026 లోపు నక్సలిజాన్ని అంతమొందిస్తామని షా స్పష్టం చేశారు.

మావోయిస్టులను మట్టుబెట్టడం అప్రజాస్వామికం

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టు ప్రధాన నేత సంబాల కేశవరావుతో సహా 27 మంది ని చంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమాజంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ వాదులు, మేధావులు రచయితలు తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్రం మొండివైఖరి ప్రదర్శించడాన్ని తప్పుబట్టారు. ఎలాంటి సమస్యకైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని చరిత్ర రుజువు చేస్తుందని కూనంనేని అన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు.

ఇవి ప్రభుత్వ హత్యలు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేసింది. చత్తీస్‌గఢ్‌తో పాటు దేశ ప్రజలందరికీ వాస్తవాలు తెలియాలని, యంత్రాంగమే జడ్జి, జ్యూరీ, ఎగ్జిక్యూషనర్ అంటే ప్రజాస్వామిక సమాజం ఒప్పుకోదని సీపీఐ పేర్కొంది. న్యాయం జరగాలని, ఆదివాసీల హక్కులు, గౌరవప్రద జీవితానికి హామీ ఉండాలని డిమాండ్ చేసింది. చత్తీస్‌గఢ్ ప్రజలకు సంఘీభావం తెలపాలని...అన్యాయానికి ఎదిరించాలని ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులకు సీపీఐ పిలుపునిచ్చింది.

ప్రముఖ శాస్త్రవేత్తల మరణం తీరని లోటు...

ప్రముఖ అణు శాస్త్రవేత్త ఎంఆర్ శ్రీనివాసన్, ఖగోళ శాస్త్రవేత్త జయంత్ నార్లికర్ మరణం దేశానికి, ప్రపంచ శాస్త్రీయ సమాజానికి తీరని లోటని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది. వారి మృతికి సంతాపం ప్రకటించింది. భారత్‌లోని సైన్స్ ఉద్యమం వీరిని మరువలేదని వెల్లడించింది. తన గురువు ఫ్రెడ్ హోయ్లేతో కలిసి విశ్వానికి ప్రత్యామ్నాయ నమూనా అభివృద్ధికిలో డాక్టర్ నార్లికన్ తోడ్పాటు అందించారు. స్వదేశీయ అణ్వాయుధ కార్యక్రమ రూపకల్పనలో ఎంఆర్ శ్రీనివాసన్ కీలకంగా వ్యవహరించారు. వీరి సేవలు మరువలేనివి అని సీపీఐ పేర్కొంది.

అలీ ఖాన్‌కు మధ్యంతర బెయిల్

- సిట్ ఏర్పాటుకు సుప్రీం ఆదేశం
- అశోక వర్సిటీ వర్గాలకు హెచ్చరిక

న్యూఢిల్లీ: అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహమూదాబాద్‌కు సుప్రీం కోర్టు మధ్యంతర బుధవారం బెయిల్ మంజూరు చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రెండు పోస్టులపై విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కేసుకు సంబంధించిన అంశాలపై రాయడం, మాట్లాడటం చేయొద్దని ఆయనకు స్పష్టంచేసింది. భారత్ ఇటీవల అనుభవించిన సంక్షోభం (పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌నుద్దేశించి)పై ఎటువంటి వ్యాఖ్యలు చేయడానికి అలీ ఖాన్ మహమూదాబాద్‌కు అనుమతి లేదని న్యాయస్థానం ఉత్తర్వుల్లో పేర్కొంది. పాస్‌పోర్టును అప్పగించాలని ఆయనను ఆదేశించింది. అదే సమయంలో అశోక వర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు ఏదైనా చేస్తే ఊరుకోమంటూ అనూహ్య రీతిలో సుప్రీంకోర్టు హెచ్చరించింది. 'వాళ్లు ఏదైనా చేసేందుకు సాహసించినా... చేతులు కలపాలనుకున్నా ఊరుకోం. ఇలాంటి వారితో ఎలా వ్యవహరించాలో మాకు బాగా తెలుసు. వాళ్లు మా పరిధిలో ఉన్నారు' అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రొఫెసర్ పెట్టిన పోస్టులను చూసిన తాము ఈ కేసులో దర్యాప్తును నిలిపివేయరాదన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపింది. పోస్టులపై సమగ్ర దర్యాప్తునకు హర్యానా, ఢిల్లీకి చెందని ముగ్గురు ఐపీఎస్‌లతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని హర్యానా డీజీపీకి ఆదేశాలిచ్చింది. సిట్‌కు ఐజీ నేతృత్వం వహించాలని, సభ్యుల్లో ఒకరు మహిళా అధికారి ఉండాలని మార్గదర్శకాలు అందించింది. అంతకుముందు విచారణ సమయంలో జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ 'ఏం జరుగుతుందో మీకు తెలియాలి. భావ ప్రకటన, వాక్ స్వేచ్ఛ తదితరాలు ఉన్నాయి. మరి విధి/బాధ్యత (డ్యూటీ) ఏది. గత 75 ఏళ్లుగా దేశం కేవలం హక్కులనే పంచుతోందా. డ్యూటీ లేదా' అని అన్నారు. దీనిని డాగ్ విజిలింగ్ అంటారని ఖాన్ తరపు వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ఏకాభిప్రాయానికి ప్రయత్నించారు. 'పక్క వారిని ఇబ్బంది పెట్టడం, అవమానించడం కోసం ఉద్దేశపూర్వకంగా చేసే వ్యాఖ్యలకు భావ ప్రకటన స్వేచ్ఛ ముసుగు దురదృష్టకరం. వాడటానికి నిఘంటువు పదాల కొరత లేదుగా...ఇతరుల భావాలు దెబ్బతీయని తటస్థ భాషను వాడవచ్చు' అని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు. జస్టిస్ కాంత్‌కు ఇబ్బందికరంగా తోచిన మాటలు/వ్యాఖ్యలు ఏవన్నది స్పష్టతలేదు. తొలుత సిబల్ వాదనలు వినిపిస్తూ 'ప్రొఫెసర్ ఖాన్ మాటల్లో నేరపూరిత ఉద్దేశం లేదు. మత ఘర్షణలు సృష్టించేందుకు ఆయన ప్రయత్నించలేదు' అని కోర్టుకు చెప్పారు. ఆయన తన బాధను వ్యక్తం చేశారన్నారు. భార్య తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్న సమయంలో ఆయన జైల్లో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ రెండవ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఆశ్చర్యంగా ఉందని కపిల్ సిబల్ అన్నారు. తాజా పరిణామంపై ఎక్స్ మాధ్యమంగా న్యాయవాది ఇందిరా జైసింగ్ స్పందించారు. తొలి సంతానానికి భార్య జన్మనిచ్చే సమయంలో ప్రొఫెసర్ ఖాన్ జైల్లో ఉన్నారు. మరోవైపు కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరి అంటూ బహిరంగంగా అవమానించిన బీజేపీ మంత్రి అరెస్టుకు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వలేదు' అని ఆమె వ్యాఖ్యానించారు.

సమన్వయంతో పనిచేయండి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేశామని వివరించారు. మూడు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొ న్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో అగ్నిమాపక సిబ్బందికి విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇప్పించామని తెలిపారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో తక్షణమే స్పందించేలా హైడ్రా బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొ న్నారు. జిల్లాలకు కేటాయించిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలతో టచ్ లో ఉండాలని సంబంధిత అధికా రులకు సూచించారు. విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించు కోవాలని సూచించారు. వరదలు, వల్లముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు అరవింద కుమార్ ఆదేశాలు జారీచేశారు.

దేశానికే వన్నెతెచ్చిన మహానేత రాజీవ్‌గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

చెప్పడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధాని మోదీ వెనకడుగు వేశారని అన్నారు. ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిదంటూ ఎద్దేవా చేశారు. తీవ్రవాదుల ముసుగులో దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలం, ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ఇందిరమ్మ ఆనాడే స్పష్టం చేశారని చెప్పారు.

రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా బీజేపీ నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిదన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్ఎంసీ మేయర్ పాల్గొన్నారు.

గొప్ప అభ్యుదయవాది సుకుమారన్

(మొదటిపేజీ తరువాయి)

ఇస్కఫ్, తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ సంతాపాన్ని చదివి వినిపించారు. సుకుమారన్ సేవలు మరువలేనివని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాగితాల రాజశేఖర్ అన్నారు. సంస్థ ప్రచురించిన మైత్రి మాస పత్రికకు సంపాదకు లుగా ఎనలేని సేవలు అందించారని చెప్పారు. సుకుమారన్ మృతి విచారకరమని తమను దిగ్భ్రాంతికి గురి చేసిందని వి.బాల మోహన్ దాస్, బొల్లిముంత కృష్ణ అన్నారు. ఆరోగ్యం సహకరించక పోయినా గత నెల 26, 27 తేదీల్లో మదనపల్లిలో జరిగిన ఇస్కఫ్ రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం కృషి చేశారని తుంగ శ్రీధర్రావు, జి.వి.శివకుమార్, ఆర్. పిచ్చయ్య, వి.రామచంద్రమూర్తి, కడుపు కన్నయ్య, డి. రాంచంద్రయ్య, కే.ఎస్. సురేష్ కుమార్ ... ఆయన సేవలను గుర్తు చేస్తుకున్నారు. సుకుమారన్ శాంతి, సాంస్కృతిక, స్నేహ ఉద్యమాల ద్వారా చేసిన కృషి మరువలేనిదని ఇస్కఫ్ జాతీయ అధ్యక్షుడు భానుదేవ్ దత్తా, ప్రధాన కార్యదర్శి పదిహారి సంతాపం తెలిపారు. సుకుమారన్ భౌతికంగా దూరమైనా ఆయన మన పోరాటాల్లో సజీవంగానే ఉంటారన్నారు. ఇస్కఫ్ కృష్ణాజిల్లా నాయకులు మోతుకూరి అరుణ కుమార్, పరుచూరి అజయ్ కుమార్ , ఇస్కఫ్ ఎన్టీఆర్ జిల్లా నాయకులు బుద్ధవరపు వెంకట్రావు, మహబూబ్ ఆజాం, టి.వి.రమణమూర్తి, ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శులు కూన అజయ్‌బాబు, యస్.వి. రమేష్ బాబు (నెల్లూరు), కె . వసంతబాబు (అనంత పురం), కాగితాల నిర్మల (గుంటూరు), లక్ష్మీ గణపతి (పశ్చిమగోదావరి), కనపర్తి బెన్హర్, సి.హెచ్. శ్రీదేవి (తెనాలి), గోలి సీతారామయ్య (మంగళగిరి), వి.యల్.చెన్నకేశవరావు (పల్నాడు), రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు కృష్ణబాబు తదితరులు సుకుమారన్ మృతికి సంతాపం తెలిపారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

విశాలాంధ్ర-హైదరాబాద్: నగరంలో వివిధ ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, కొత్తపేట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, తిరుమలగిరి, బేగంపేట, అల్వాల్, సైదాబాద్, సంతోష్‌నగర్, చాదర్‌ఘాట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడా, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డలో వర్షం కురిసింది. దీంతో రహదారులపై నీరు నిలిచింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో వర్షం కురిసింది. నర్సంపేట, ఖానాపురం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయి. తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్‌తో పాటు సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం... వివిధ చోట్లు పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది.

విశాఖ ఉక్కు కాపాడుకుందాం

ప్రైవేట్ సంస్థలకు దోచిపెడితే సహించబోం: సీపీఐ నేత రామకృష్ణ



విశాలాంధ్ర-విజయవాడ: విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా కార్మికులు చేపడుతున్న సమ్మెకు వామపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దీనిలో భాగంగా విజయవాడలో వామపక్ష పార్టీల అధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సీపీఎం నేత దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం పెద్దఎత్తున ఉద్యమించి 32 మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా ప్రైవేటీకరణ చేసేందుకు మోదీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమను స్థాపించడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, 26 ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించడానికి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. అంబానీ, అదానీలకు పెద్దపీట వేసి కేంద్ర సంస్థలను అప్పగిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర సంపదను అప్పనంగా దోచుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం బీజేపీకి వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. పదవులను కాపాడుకోవడానికి బాంచన్ దొర... నీ కాళ్లు మొక్కుతాం అన్నట్లు చంద్రబాబు, పవన్ వ్యవహారశైలి ఉందని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా సీఎం చంద్రబాబు ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. ఉక్కు కార్మికుల సమ్మెను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటు పరం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సుదీర్ఘ ఆందోళన తరువాత సమ్మెలోకి వెళ్లే పరిస్థితి అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కల్పిస్తుందని మండిపడ్డారు. గత ఎనిమిది నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వలేదని అన్నారు. దాదాపు మూడు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులు తాము నమ్మిన సిద్ధాంతం కొరకు ఆ మార్గం ఎంచుకున్నారనీ... చర్చలకు సిద్ధమని వారు ప్రకటించినప్పుడే ... వారు పునరాలోచనలో పడ్డారని గ్రహించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశం, రాష్ట్రంలో బీజేపీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతుందన్నారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌తో చర్చలు జరుపుతున్నారు తప్ప, దేశ పౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ఆయన ప్రశ్నించారు.

బూటకపు ఎదురుకాల్పులు పౌర హక్కులను కాల రాయడమే అవుతుందని వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని చాడ డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : కనగల్ మండలం తేలకంటి గూడెంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి లబ్ధిదారులు వర్షాకాలంలోపు గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె తేలకంటి గూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఈ సంవత్సరం జనవరి 26న కనగల్ మండలం, తేలకంటి గూడెంలోని ఇండ్లు లేని 107 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ సంవత్సరాల నుండి గుడిసెల్లో జీవిస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడమే కాకుండా, ఇంత త్వరగా ఇండ్లు కట్టించి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ ఉన్నారు.

విద్యార్థులు విద్య వైపు దృష్టి సారించాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తుందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, బుధవారం హైదరాబాద్‌లోని కొమరం భీం ఆదివాసి భవనంలో బంజారాహిల్స్‌లో నిర్వహించిన అకాడమిక్ సక్సెస్ మీట్‌లో మంత్రి సీతక్కతో కలసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత లక్ష్యాలను టార్గెట్‌గా పెట్టుకొని లక్ష్య సాధన కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను అప్గ్రేడ్ చేయాలని కోరారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలని, చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అధికారులు పాఠశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గకుండా చూడాలని సూచించారు. హైదరాబాద్ కేంద్రంగా సక్సెస్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మంత్రితో కలసి ఇటీవల 10వ, ఇంటర్, ఎంసెట్, జేఈఈ మెయిన్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర జిసిసి చైర్మన్ తిరుపతి, ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి ఏ.శరత్ కుమార్, ఉన్నత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

28 వరకు వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర - కొమరం భీం : జిల్లాలో ఈనెల 28వ తేదీ వరకు ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సీతారాం అన్నారు. జిల్లాలో బుధవారం ప్రారంభమైన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంకుశాపూర్ ఉపకేంద్రం తెలిగూడలో ఏర్పాటుచేసిన వ్యాధి నిరోధక కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని వ్యాధి నిరోధక నోడల్ అధికారి సంపత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, టీకా అవసరం ఉన్న ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి పోరాటాలు కొనసాగించాలి

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్/ మరిపెడ : క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు క్రియాశీలక ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మరిపెడ పట్టణ కేంద్రాల్లో అక్కినపల్లి రాములు అధ్యక్షతన జగిన మరిపెడ టౌన్ ఐదవ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా కేంద్రంలో పరిపాలన చేస్తున్న బిజెపి పార్టీ నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించడంలో, దేశ సంపద కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతూ ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నా పట్టించు కోకుండా, ప్రతిశీల శక్తుల ఐక్యమై ఎదురుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మరిపెడ టౌన్ కార్యదర్శిగా మల్లెపాక యాకన్న, సహాయ కార్యదర్శిగా పగిల్ల అంజయ్య, ఏడుగురితో కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డిని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ ఇటీవల నియమించిన సందర్భంగా సుధాకర్ రెడ్డని సివిల్ సప్లై హమాలి యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ,నెల్లుట్ల నారాయణ, పాక వెంకన్న, ఎం వెంకన్న తిప్పర్తి సైదులు పానుబోతు వెంకన్న పానుబోతు రమేష్ పాక నరేష్ రాసల్ల యుగంధర్ లింగయ్య మధు రేగ నరసయ్య గంట వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర- మరిపెడ: దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని మరిపెడ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జాటోత్ సురేష్ నాయక్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం మరిపెడ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి అప్సర్,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ రవికాంత్, మరిపెడ పట్టణ యువ నాయకుడు బంక ప్రమోద్,యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ తేజావత్ అఖిల్ నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించేలా సీతారామ ప్రాజెక్టు నిర్మించాలి

ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లా రైతాంగ సాగునీటి కష్టాలు తీర్చేవిధంగా ఈ ప్రాంత రైతులకు ఈ జిల్లా నీటి వనరు ఉపయోగపడేలా సీతారామ ప్రాజెక్టు, కాల్వల నిర్మాణం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. బుదవారం పాల్వంచ మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలు పరిధిలో రూ. 4.49 కోట్ల నిధులతో సీసీ రోడ్లు డ్రైనేజీలు నిర్మాణానికి శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ గత బిఆర్ఎస్‌పార్టీ పాలకులు అనాలోచిత నిర్ణయాలతో గోదావరి జలాలు ఈ జిల్లా ప్రజలకు అందకుండా పోయేలా డిజైన్ చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సాగునీటిని అందించాలన్నారు. ప్రత్యేకంగా కొత్తగూడెం నియోజకవర్గానికి అధిక సాగునీటిని అందించాలన్నారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్లు చెప్పారు. పట్టణాలకు దీటుగా గ్రామాలను కూడా మరింత అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గల్లీకి రహదారులు డ్రైన్ల నిర్మాణానికి పక్కా ప్రణాళికతో నిధులు వెచ్చిస్తున్నామన్నారు. అతి త్వరలోనే చిన్న చిన్న గల్లి రోడ్లను కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా, పదికాలాలపాటు నిలిచివుండేలా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసిల్దార్ దార ప్రసాద్, ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ డిఈ రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాషా, రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, టీడీపీ రాష్ట్ర నాయకులు కనగాల అనంతరాములు, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, నాయకులు శనగరపు శ్రీనివాసరావు, మన్యం వెంకన్న, మాజీ ఎంపీటీసీ వీర మోహన్ రావు, వై ఎస్. గిరి, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కొండా వెంకన్న, నాగేశ్వరావు ఉపేందర్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి గుంపెన సొసైటీ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఇటీవలే విద్యుత్ షాక్‌తో మృతిచెందిన మామిడి రెమ్మల్య కుటుంబానికి గుంపెన సొసైటి ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందించారు. అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని మర్రిగూడెం పంచాయతీ (తెలిజర్ల)లో పి.ఎ.సి.ఎస్ గుంపెన సోసిటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఈనెల 15న ధాన్యం తూర్పాలు పోసేందుకు వెళ్లి కూలి మహిళ మామిడి రెమ్మల్య ప్రమదశాత్తు కరెంట్ షాక్‌కి గురై మృతి చెందింది. రెమ్మల్య తండ్రి పుష్పరాజ్‌కు కుటుంబం సభ్యులు అయిన మామిడి రాజ్ కుమార్‌కు గుంపెన సొసైటీ ద్వారా మానవతా దృక్పథంతో రూ. ఒక లక్ష విలువ చేసే చెక్ ను సంఘం అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్‌రావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపేరు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు నల్లమోతు వెంకట నారాయణ, డైరెక్టర్ బోలు రామకృష్ణ, కొత్తూరు వెంకటేశ్వరరావు, ఎస్‌కె. రహీం తదితరులు పాల్గొన్నారు.

పాలెంవాగు ప్రాజెక్టు కాలువ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : వెంకటాపూర్ మండలంలోని పాలెం వాగు ప్రాజెక్టు ప్రధాన కలువ నిర్మాణ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని, నిర్మాణం పనుల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ ఈ సాయి ప్రసాద్, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు ఉన్నారు.

పెన్షన్ పెంచాలని బొగ్గు శాఖ మంత్రికి విన్నపం

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి: బొగ్గు రంగంలోని పెన్షనర్లకు పెన్షన్ పెంపుదల కోసం కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని న్యూఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ బి.కె.శ్రీవాస్తవ్, పి.కె.సింగ్ రాథోడ్ కలిసి విన్నవించారని కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డి.రామచందర్‌రావు, ఆళవందార్ వేణు మాధవ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతినిధులు బొగ్గుగని పెన్షనర్ల పెన్షన్ ప్రారంభం నుండి పెరగలేదని,తక్కువ పెన్షన్‌తో బతికే బొగ్గు పెన్షనర్ల బాధలను మంత్రికి వివరించడం తో పాటు కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు పెన్షనర్లను వేధిస్తున్న సమస్యలను కూడా మంత్రి దృష్టికి తెచ్చినట్లు వారు పేర్కొన్నారు.

భూసమస్యల దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూసమస్యల దరఖాస్తుల ను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటాల మండలంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా ముగియడంతో బుధవారం కలెక్టర్ కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా మొత్తం 667 భూ సంబంధిత దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, సాధాబైదామా, పేరు, చిరునామా మార్పులు, తప్పుల సవరణలు, మ్యూటేషన్ వంటి సమస్యలు తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులపై అధికారులు వివరాలను కలెక్టర్‌కు అందజేశారు. భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి, ఇరు పక్షాల సమక్షంలో పారదర్శక విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రేపటి నుంచే చర్యలు చేపట్టాలని, దరఖాస్తుదారులను ఇయరింగ్‌కు పిలిపించి, రోజువారీగా పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. పారదర్శకంగా, ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసీల్దార్లు కమల్ సింగ్, ప్రవీణ్ కుమార్, ఏజాజ్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శుల ఎన్నిక

విశాలాంధ్ర - కారేపల్లి : కారేపల్లి మండల పరిధిలోని భాగ్యనగర్ తండా, ఉసిరికాయలపల్లి సిపిఐ గ్రామ శాఖల కార్యదర్శులుగా ఇస్లావత్ భావ్ సింగ్, జక్కుల కోటమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల పరిధిలోని భాగ్యనగర్ తండా, ఉసిరికాయలపల్లి గ్రామాలలో సిపిఐ పార్టీ గ్రామ శాఖల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం కోసం పలు తీర్మానాలు చేశారు. అలాగే భాగ్యనగర్ తండా గ్రామ శాఖ కార్యదర్శిగా ఇస్లావత్ బాబు సింగ్ తో పాటు11 మందితో కౌన్సిల్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉసిరికాయలపల్లి మహిళా సమైక్య గ్రామ శాఖ కార్యదర్శిగా జక్కుల కోటమ్మతో పాటు ఆరుగురు సభ్యులతో కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వైరా సీపీఐ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, రావి శివరామకృష్ణ పాల్గొన్నట్టు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యదర్శులను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

శాంతి, మత సామరస్యాన్ని కాపాడండి

విశాలాంధ్ర - ఖమ్మం : దేశంలో ఖమ్మం నగరానికి ఒక విశిష్ట స్థానం ఉందని అనేక దశాబ్దాలుగా శాంతి మత సామరస్యాన్ని కాపాడడంలో ఖమ్మం నగర ప్రజలు చైతన్యవంతులని ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం నగరానికి ఒక విశిష్టత ఉందని చైతన్యానికి, మత సామరస్యానికి, అభ్యుదయ భావజాలానికి ఖమ్మం ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఒకట్రెండు ఘటనలు చూసి ఏదో జరిగిపోతుందని ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేయవద్దన్నారు. మత విద్వేషాలకు ఖమ్మంలో స్థానం ఆలేదన్నారు. కొన్ని అరాచక శక్తులు మత ఉన్మాదులు ప్రజల మధ్య ఉన్న సద్భావన వాతావరణాన్ని చెడగొట్టేందుకు ఇప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇటువంటి శక్తులు, వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ కఠినంగా వ్యవహరించాలని సలాం కోరారు. ఇటీవల టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి పోలీస్ పాత్ర ప్రశంసనీయమని సలాం తెలిపారు. ఏ మతం వారైనా భారతీయులేనని సోదర సమానులుగా భావించి నడుచుకుంటే ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావుండదన్నారు. ఒకరిద్దరి కారణంగా ఘర్షణ వాతావరణం నెలకొన్నప్పుడు ఇరు వర్గాలు సమన్వయం పాటిస్తే సమస్య దూరమవుతుందని సలాం పేర్కొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి:కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలని టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. బుధవారం టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతూ హెలిప్యాడ్ పనులు, ప్రజా వేదిక సభ ఏర్పాటు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకు న్నారు. ఈనెల 23న సీఎం పర్యటన ఏర్పాట్లను రేపటిలోగా పూర్తి చేయాలని టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రణాళిక వివరాలు, గ్రీనరీ, స్టేజి ఏర్పాట్లు, స్టేజి అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ త్రాగునీరు, టాయిలెట్స్, సభకు హాజరయ్యే ప్రజలకు సదుపాయాలు అన్ని రేపటిలోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై



విశాలాంధ్ర - పినపాక : ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి కొందరు నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏడూల్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ అన్నారు. బుధవారం పినపాక కేజీబీవీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలు ఈ మధ్య విపరీతంగా పెరిగాయన్నారు. పిల్లలపై వాటి ప్రభావం ఎక్కువగా ఉందని చెప్పారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పోల్చుకుంటే ప్రస్తుతం క్రైమ్ రేటు 60 శాతానికి పెరిగిందని వివరించారు. కొత్త వ్యక్తులు ఎవరు ఫోన్ చేసినా వారికి వ్యక్తిగత విషయాలు చెప్పరాదన్నారు. పిల్లలకు రాత్రిపూట ఎక్కువ సమయం ఫోన్లు ఇవ్వరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్ప్ లైన్ వందనం వినియోగించుకోవాలని ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930 కి ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పినపాక, కరకగూడెం విద్యాశాఖ అధికారులు కొమరం నాగయ్య, జి. మంజుల, రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులు, ఎంఆర్పి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామ కెనాల్ పెండింగ్ భూసేకరణ వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సీతారామ ఎత్తిపోతల పథకం కెనాల్ భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కెనాల్ భూ సేకరణ పై ఇరిగేషన్, సర్వే అధికారులతో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కెనాల్ నిర్మాణానికి భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహించాలన్నారు. జిల్లావ్యాప్తంగా వారం రోజుల్లోగా గ్రామసభలు నిర్వహణ పూర్తి చేయాలన్నారు. కాల్వల ఏర్పాటుతో రైతుల భూములకు పుష్కలంగా నీళ్లంది భూ విలువ పెరుగుతుందన్నారు. ఈ విషయం పై అవగాహన కల్పించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు సర్వేయర్లు సమన్వయంతో భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేయర్లకు అవసరమైన ఆధునిక యంత్ర పరికరాలు, లాప్టాప్‌లు అందజేస్తామని చెప్పారు. సర్వే లో ఆధునిక పద్ధతులను అవలంభించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్ అధికారులు జిల్లావ్యాప్తంగా ఉన్న చెరువులలో పూడికలు తీయించాలన్నారు. తద్వారా నీటి నిల్వలు పెంచుకోవచ్చని సూచించారు. అధికారులందరూ పూడిక పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి అన్ని చెరువుల్లో చేపట్టాలన్నారు. చెరువులు, కాలువల వెంట సుబాబులు, తంగేడు తాటి చెట్లను విస్తృతంగా నాటే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు కాశయ్య, సుమ, ఇరిగేషన్ శాఖ ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ లు అర్జున్ రావు, సురేష్ కుమార్, చారి, డిఈ లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బాధితులతో పోలీసులు మర్యాదగా వ్యవహరించాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : తమకు న్యాయం జరుగుతుందని భావించి పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల బాధ్యతగా, మర్యాదగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీసులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ అన్నారు. స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బందిని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల దారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్, ఎస్సై ఉమ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : భారతదేశ ఐటీ సాంకేతిక విప్లవానికి బాటలు వేసినది భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొనతం చిన్న వెంకటరెడ్డి కొనియాడారు. నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొనతం చిన్న వెంకట్ రెడ్డి మాట్లాడారు. చిన్న వయసులో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి ఐటీ సాంకేతిక రంగం ద్వారా ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రగామిగా చేశారని భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచిన నాయకుడిగా యువ ప్రధాని రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్ మార్కెట్ వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి డైరెక్టర్ మచ్చ శ్రీనివాస్ మాజీ సర్పంచులు ఆకారపు వెంకటేశ్వర్లు చింతమల్ల సైదులు మాజీ కౌన్సిలర్ నాగయ్య యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్తియాక్ నాయకులు రాచకొండ అజయ్ పాండు నాయక్ తోట శ్రీనివాస్ లీలామనుష్ రెడ్డి గుంటూరు శ్రీను సతీష్ పిచ్చయ్య జానయ్య రవి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - భద్రాచలం : జిల్లాలోని బూర్గంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉండాల్సిన డాక్టర్‌తో పాటు సూపర్డెంట్, హెడ్ నర్సు విధులకు డుమ్మా కొట్టారు. స్టాఫ్ నర్సులు మాత్రమే ఆసుపత్రిలో కలెక్టర్‌కు కనిపించారు. దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రిని ఇంత దారుణంగా నిర్వహిస్తున్నారా అని అక్కడి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. నెల నెల జీతాలు తీసుకుంటూ విధులకు హాజరు కాకుండా ఆసుపత్రికి వచ్చే రోగులతో ఆటలాడుకుంటారా అని ప్రశ్నించారు. పెద్ద మొత్తంలో నెల నెలా జీతాలు ఇచ్చి ఇక్కడ ఆసుపత్రి నడపడంలో అర్థం లేకుండా పోయిందన్నారు. ఆసుపత్రిని బంద్ చేసి వేరే చోట ఉద్యోగాలు చేసుకోవాలని సిబ్బందితో అన్నారు. ఈ ఆస్పత్రి ప్రధాన డాక్టర్, అధికారులపై ఎప్పటినుంచో గైర్హాజరు ఫిర్యాదులు వున్నాయని స్థానిక ప్రజలు అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కఠినమైన చర్యలు తీసుకుంటే తప్ప డాక్టర్ల తీరు మారదని స్థానికులు అంటున్నారు. ఈ తనిఖీలో కలెక్టర్‌తో పాటు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ అధికారి డాక్టర్ రవిబాబు కూడా ఉన్నారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర - జిల్లా బ్యూరోమహబూబాబాద్: 2024- 25 సంవత్సరానికి గాను మహబూబాబాద్ జిల్లాలో చదువుతున్న ఎస్సీ /ఎస్టీ/ బీసీ/ ఓసి/ఈ బి సి విద్యార్థులు పోస్టుమెట్రిక్ స్కాలర్షిప్ కొరకు ఆఖరి తేదీ మే 31 అన్నారు. www.telanganaepass.cgg.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోగలరని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం. నరసింహస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంపాదకీయం

అసమ్మతి సహించని రోజుల్లో

వారం రోజుల కింద అరెస్ట్ చేసిన అశోకా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మదాబాద్‌కు సుప్రీంకోర్టు బుధవారం బెయిలు మంజూరు చేసింది. అలాగే పీఎల్ఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్‌కు కూడా బెయిలు మంజూరు అయింది. రెండింటి మధ్య సామ్యమల్లా బెయిలు హక్కు అని ఎంత మంది న్యాయమూర్తులు ఎన్నిసార్లు చెప్పినా కొంతమందికి బెయిలు మంజూరు కాని సమయంలో బెయిలు మంజూరు కావడమే. అయితే ఈ రెండు కేసులు ఒకే లాంటివి కావు. ఆపరేషన్ సిందూర్ తరవాత ఇద్దరు మహిళా సైనికాధికారులు పత్రికా విలేకరుల సమావేశంలో చెప్పిన వివరాల ఆధారంగా ప్రొఫెసర్ అలీ ఖాన్ ఫేస్‌బుక్‌లో కొన్ని వ్యాఖ్యలు చేసినందుకు ఆయన మీద అనేక తీవ్రమైన ఆరోపణలు మోపి అరెస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్ మాట సరే గానీ మూక హత్యల గురించి ఎందుకు మాట్లాడరు అని అలీఖాన్ ఈ ఫేస్ బుక్ పోస్టులో ప్రశ్నించడం హర్యానా ప్రభుత్వాన్ని కుపితం చేసింది. ఒక స్థానిక బీజేపీ నాయకురాలి ఫిర్యాదు ఆధారంగా అలీ ఖాన్ ను అరెస్టు చేశారు. కేరళలోని పాలక్కడ్‌లో ఒక ఆర్ఎస్ఎస్ కార్యకర్త హత్యకు కుట్ర పన్నారన్న కేసులో అరెస్టయిన పీఎల్ఎఫ్ నాయకుడు అబ్దుల్ సత్తార్‌కు కూడా విముక్తి కలిగింది. భావజాలం ఆధారంగా ఎవరినీ జైలులో పెట్టడానికి వీలులేదు అని వ్యాఖ్యానించింది. ప్రస్తుత వాతావరణంలో ఈ ఇద్దరు ముస్లింలకు బెయిలు మంజూరు కావడం విశేషమే. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. అయితే సుప్రీంకోర్టు అలీఖాన్‌కు బెయిలు మంజూరు చేసిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆవేదన కలిగించేవిగా ఉన్నాయి. అలీ ఖాన్ "చౌకబారు జనాకర్షణ" కోసం ప్రయత్నించారని అత్యున్నత న్యాయస్థానం భావించడం విచిత్రంగా ఉంది. ఫేస్‌బుక్‌లో అలీఖాన్ రాసిన మాటలకు, ఆయనను అరెస్టు చేసిన తీరుకు అసలు పొంతనే లేదని సుప్రీంకోర్టు అంగీకరిస్తున్నట్టు లేదు. అందువల్లే చౌకబారు ప్రచారం కోసం అలీఖాన్ వ్యాఖ్యలు చేశారని అనగలిగింది. అలీఖాన్ వ్యాఖ్యలు చౌకబారు ప్రచారం కోసమైతే ప్రభుత్వానికి అవి "దేశ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించేవిగా, దేశ సమగ్రతను దెబ్బ తీసేవిగా" ఎందుకు కనిపించాయో తెలియదు. అలీఖాన్ కేసును సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్ విచారించారు. అలీ ఖాన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. "అందరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉందన్న విషయం వాస్తవమే. కానీ అలీ ఖాన్ అన్న మాటలకు ఇది అనువైన సమయమా? అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించారు. అంటే భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి, పౌర హక్కుల గురించి మాట్లాడడానికి అవి మంటగలుస్తున్నప్పుడు తప్ప మరెప్పుడు మాట్లాడాలో! అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడు ఇలాంటి ప్రస్తావనలకు అవకాశమే ఉండదు. "రాక్షసులు వచ్చి మన ప్రజల మీద కిరాతకంగా దాడి చేశారు. ఈ సమయంలో మనం ఐక్యంగా ఉండాలి. ఇలాంటి సందర్భాలలో చౌకబారు ప్రచారం కోసం ఉబలాట పడడం ఎందుకు?" అని న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు ఇలాంటి విపత్కర సమయాల్లోనే అకృత్యాలకు పాల్పడతాయని సదరు న్యాయమూర్తికి తట్టక పోవడం ఆశ్చర్యం. పహల్గాంలో తీవ్రవాదులు దాడి చేసిన తరవాత స్వపర భేదాలు లేకుండా అన్ని పక్షాల వారు ప్రభుత్వానికి అండగా నిలబడ్డారు. అలీ ఖాన్ కూడా అదే పని చేశారు. అయితే ఆయన అదనంగా మూక హత్యల లాంటి అంశాలను అత్యంత ఆవేదనతో లేవనెత్తారు. ఇది చౌకబారు ప్రచారం కోసం పడే ఆరాటంలో భాగమని న్యాయమూర్తి సూర్యకాంత్ కు ఎందుకు అనిపించిందో! దేశ సమైక్యత అంటే నిరంకుశ పాలకుల అకృత్యాలను ప్రశ్నించకుండా ఉండడం కాదు. నిజానికి అలీ ఖాన్ రాసిన ఫేస్ బుక్ రాతల్లో ఎక్కడా నేరపూరిత ఉద్దేశం కానీ, రాజద్రోహం ఛాయలు గానీ లేవు. హక్కులు ఉన్నందువల్ల బాధ్యతల గురించి మాట్లాడడం తప్పు ఎలా అవుతుంది? ప్రొఫెసర్ అలీఖాన్ మాటలు పనిగట్టుకుని అవమానించే రీతిలో ఉన్నాయని కూడా సదరు న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తప్పొత్తి చూపడం అవమానించినట్టు అవుతుందా! అలీఖాన్‌కు నిఘంటువులో మాటలే దొరకలేదా? ఇతరుల మనోభావాలను దెబ్బతీసే భాష వాడి ఉండకూడదు. తటస్థమైన భాష వినియోగించాల్సి ఉండింది అని కూడా సూర్యకాంత్ అన్నారు. మూకహత్యలను సుతిమెత్తని భాషలో ఖండించడానికి ప్రత్యేకమైన నిఘంటువులు ఏమైనా ఉన్నాయా!

సూర్య కాంత్ మీద హర్యానా మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేణు భాటియా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ఆమె వాదనలనుబట్టి చూస్తే అలీఖాన్ ఇంగ్లీషులో రాసిన మాటలు ఆమెకు సవ్యంగా అర్థం అయినట్టు లేదు. అయినా ఎవరైనా ఎఫ్ఐఆర్ దర్యాప్తు చేయగానే ఎలాంటి ప్రాథమిక దర్యాప్తు లేకుండా జైలులో తోసేయడం ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం అవుతుందా? ప్రొఫెసర్ అలీ ఖాన్ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేశీ మీద, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీద ఒక్క మాట కూడా అవమానకరంగా మాట్లాడలేదు. వారిని అభినందనలతో ముంచెత్తుతున్న వారు "మూక హత్యలు, బుల్డోజర్లతో ముస్లింల ఇళ్లు కూల్చేయడం" గురించి ఎందుకు మాట్లాడరు అని ప్రశ్నించారు. విపత్కర సమయంలో ఇలాంటి భాష వాడకూడదని సుప్రీంకోర్టే భావిస్తే ఈ అకృత్యాలను ఎత్తి చూపడానికి సుముహూర్తం ఏమైనా ఉంటుందనుకోవాలేమో. పాలక్కడ్ లో ఆర్ఎస్ఎస్ కార్యకర్త శ్రీనివాసన్ హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణపై అరెస్టయిన పీఎఫ్ఐ మాజీ ప్రధాన కార్యదర్శికి కూడా సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేసింది. భావజాలం ఆధారంగా ఎవరినీ జైలులో ఉంచకూడదు అని హితవు కూడా చెప్పింది. జైళ్లల్లో మగ్గుతున్న పౌరహక్కుల నాయకులు, మావోయిస్టులు ఈ భావజాలం కారణంగానే కటకటాలు లెక్కిస్తున్నారు కదా! ఈ పరిస్థితిని పండిత్ నెహ్రూ నాటి కాలంలో ప్రసిద్ధ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ విషయంలో వైఖరిని పోల్చి చూస్తే పరిస్థితి ఎంత భయానకంగా మారిందో అర్థం అవుతుంది. ఇర్ఫాన్ హబీబ్ కు ఇప్పుడు 94 ఏళ్లు. ఇర్ఫాన్ హబీబ్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైనప్పటికీ ఆయనకు ఉపకార వేతనం అందడానికి నెహ్రూ సహాయ పడ్డారు. 1955లో ఇర్ఫాన్ హబీబ్ కమ్యూనిస్టు కనక ఆయనకు ఉపకార వేతనం ఇవ్వడానికి నిరాకరించారు. మొదట నెహ్రూ ఇర్ఫాన్ హబీబ్ భావజాలంపై తీవ్ర దాడే చేశారు. ఇలాంటి వారు ఉపకార వేతనంతో చదువుకుని తరవాత రాజ్యవ్యవస్థ మీదే దాడి చేస్తారు అని నెహ్రూ అన్నారు. కానీ ఆయనకు ఉపకారవేతనం మంజూరు చేయించారు. కానీ ఇవి అసమ్మతిని ఏ మాత్రం సహించని రోజులుగా!

ఆసక్తికరంగా బీహార్ రాజకీయం

పతకమూరు దామోదర్ ప్రసాద్

బీహార్ 18వశాసనసభకు వచ్చే అక్టోబర్-నవంబర్‌లో జరిగే ఎన్నికలకు ప్రధాన రాజకీయపార్టీలు సమాయత్తమై అప్పుడే రణభేరి మోగించాయి. 13.1కోట్ల జనాభాతో దేశంలో రెండో పెద్ద రాష్ట్రంగా ఉన్న బీహార్‌లో సామాజిక న్యాయం, కులాల ప్రభావం అధికం. ప్రధాని మోదీ కశ్మీరు పహల్గాంలో టెర్రరిస్టులు యాత్రికులపై దాడులు జరిపి 26 మందిని చంపివేశారని తెలిసినవెంటనే స్వదేశానికివచ్చారు. ఆ తరువాత నేరుగా బీహార్‌కు వచ్చి మధుబని బహిరంగసభలో ప్రసంగించారు. మళ్లీ ఈ నెల 29-30 తేదీలలో బీహార్ పర్యటన మోదీ శాసనసభ ఎన్నికలకు ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ఆర్ జేడీ అధినేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా శాసన సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సంప్రదాయంగా మద్దతు ఇచ్చే యాదవ, ముస్లిం వర్గాలనే గాక మహిళలు, వ్యాపారులు, అత్యంత వెనుకబడిన వర్గాలను మహా కూటమి వైపు ఆకట్టుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల పాట్నాలో ఆర్జేడీ ఈబీసీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రసంగిస్తూ నితీశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ పాలనలో అత్యంత వెనుకబడిన కులాల వారెవరూ బాగుపడలేదనీ, బాగుపడింది నితీశ్ కుటుంబమేనని నిప్పులు చెరిగారు.

ఈబీసీలు బాగుపడాలి అంటే మహాకూటమిని అధికారంలోకి తెచ్చి తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని వక్తలు పిలుపు ఇచ్చారు. ఈబీసీలకు భద్రత, గౌరవం, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, నేరాల నుంచి, నేరస్థుల నుంచి రక్షణ కల్పిస్తామని, అవమానించిన వారిని కఠినంగా శిక్షిస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌పై విమర్శలను తిప్పి కొడుతూ సామాజిక న్యాయం జరిగింది ఆర్జేడీ పాలనలోనేనని తేజస్వి గుర్తు చేశారు. ఆర్జేడీకి దూరంగా ఉన్న అగ్రవర్ణాలను కూడా ఆకట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఏప్రిల్ నెలాఖరులో పాట్నాలో వైశ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. 16వ శతాబ్దినాటి వైశ్య ప్రముఖ నేత భామాషా జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించి తేజస్వి వైశ్యులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. వైశ్యులు ఎంతో పరిశ్రమించి ఎన్నో సంస్థలు స్థాపించి వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ బీహార్ పురోభివృద్ధికి తోడ్పడుతున్నారని తేజస్వి కొనియాడారు. 2022 ఆగస్టు నుంచి 2024 ఆగస్టు వరకు తాను బీహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ 50 వేల కోట్ల కొత్త పెట్టుబడులు తెచ్చి లక్షలాది ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని తేజస్వి గుర్తు చేశారు.

2020 శాసనసభ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడినా, బీసీలు అధికంగా ఉన్న 15 స్థానాలను ఆర్జేడీ కోల్పోయింది. అందుకే సంప్రదాయ ఓటర్లు గాక ఇతర సామాజిక వర్గాల మద్దతును కూడగట్టు కుంటేనే విజయం సాధ్యమనే వాస్తవాన్ని గుర్తించి తేజస్వి ఈబీసీలు, అగ్రవర్ణాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల ఆర్జేడీకి ఓటు బ్యాంకుగా ఉన్న యాదవ, ముస్లిం వర్గాల్లో అసంతృప్తి రేగుతుందేమోననే ఆందోళన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అదీగాక తేజస్వి మొదట మహాకూటమి భాగస్వామ్య పక్షాల మధ్య ఈ అంశాలపైనే గాక సీట్ల పంపిణీలో ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది. బీహార్‌లో అంత బలం లేని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో పట్టుపట్టి 70 స్థానాలు తీసుకుని వాటిలో కేవలం 19 స్థానాల్లో గెలుపొందింది. సీపీఐ (ఎంఎల్) 19 స్థానాల్లో పోటీ చేసి 12 చోట్ల గెలిచి సత్తా చాటింది. ఒకప్పుడు బీహార్‌లో గణనీయంగా బలం కలిగిన సీపీఐ 2 స్థానాలు, సీపీఎం 2 స్థానాలు, ఒక స్వతంత్రుడు గెలిచారు. గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో ఉండి 13 స్థానాలకు పోటీ చేసిన వికాశీల్ ఇన్సాన్ పార్టీ ఈసారి మహా కూటమిలో చేరినందున ఆపార్టీకి నాలుగైదు స్థానాలు అయినా ఇవ్వక తప్పదు. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాలను 50కి తగ్గించు కోవాలని ఒప్పించడం తేజస్వికి సవాలే. 2020 ఎన్నికలలో బీజేపీ, జేడీయు ఎన్డీయేగా పోటీ చేసి 125 స్థానాలు గెలిచి మళ్లీ నితీశ్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మహా కూటమి 110 స్థానాలు గెలవగా అందులో 144 స్థానాలకు పోటీ చేసిన ఆర్జేడీ 75 స్థానాలు గెలిచి తేజస్వి ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యారు. ఎన్డీయేకు 37.26 శాతం ఓట్లు రాగా మహా కూటమికి 37.23 శాతం ఓట్లు వచ్చాయి. రెండు కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 0.3 మాత్రమే. బీజేపీకి 19.46 శాతం ఓట్లు లభించాయి. మజ్లిస్ పార్టీ ఉత్తర బీహార్ సీమాంచల్ ప్రాంతంలో పోటీచేసి 5 స్థానాలు గెలిచి మహా కూటమిని దెబ్బతీసి ఎన్డీయే గెలిచేలా చేసింది చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీ సొంతంగా 54 స్థానాల్లో బరిలోదిగి 25 స్థానాల్లో జేడీయూ గెలుపును దెబ్బతీసింది. జేడీయూ స్థానాలు 43కు తగ్గాయి. ఇన్నాళ్లూ రాజకీయాలకు దూరంగా ఉన్న నితీశ్ కుమారుడు నిశాంత్ ఇప్పుడు తన తండ్రికి ముఖ్యమంత్రిగా మరో అవకాశం ఇవ్వాలని మోదీని కోరుతున్నారు. ఈసారి గెలిస్తే బీజేపీకే ముఖ్యమంత్రి పదవి అని కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. 35 యేళ్ల తేజస్వికి, 73 యేళ్ల నితీశ్‌కు పోటీ జరిగితే బీహార్ ప్రజలు ఎవరిని గెలిపిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

బీహార్ సామాజిక స్వరూపాన్ని పరిశీలిస్తే అగ్రవర్ణాలు 16 శాతం కాగా, బీసీలు 27 శాతం, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 36 శాతం, దళితులు దాదాపు 20 శాతం, ముస్లింలు 17 శాతం, యాదవ్‌లు 14 శాతం ఉన్నారు. బీహార్‌లో నెలకు 6 వేల కంటే ఆదాయం గలవారు 34 శాతం ఉన్నారు. చంద్రగుప్తుడు, అశోకుడు యేలిన మౌర్య సామ్రాజ్య వైభవం, గౌతమ బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు వంటి మహాత్ములు జన్మించిన పుణ్య భూమి, ఒకప్పుడు నలందా వంటి అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలతో వైభవంగా "విలసిల్లిన" చారిత్రక భూమి స్వాతంత్ర్యం లభించి 77 ఏళ్లు గడిచినా ఇంకా వెనుకబడి ఉండటం విచారకరం. అపార మానవ వనరుల వినియోగానికి కుల,మత, ప్రాంతీయ ధోరణులు లేకుండా అభివృద్ధే ఏకోన్ముఖంగా. నడిపే దక్షత గల నాయకత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యం.

సెల్: 9440990381

ముస్లింలపై ఆగని విద్వేష ప్రచారం

రామ్‌పునియాని

పహల్గాం సమీపంలోని బైసరాన్‌లో టెర్రరిస్టులు 26 మంది యాత్రికులను అత్యంత దారుణంగా కాల్చి చంపిన ఘటన దేశ ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. ఈ దుర్ఘటన అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాలలో ముస్లింలపైన విద్వేష ప్రచారం చాలా ఎక్కువగా జరిగింది. ముస్లింలపై దాడులు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్వేషానికి, దౌర్జన్యాలను నిరోధించేందుకు ఏమాత్రం ప్రయత్నం చేయలేదు. ఒకవైపు టెర్రరిస్టుల మీద, వారిని పెంచి పోషించిన పాకిస్థాన్ మీద ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో టెర్రరిస్టుల దుర్మార్గం అనంతరం ఇతర యాత్రికులను ముస్లింలు తమ ఇళ్లకు తీసుకెళ్లి రక్షించారు. స్థానిక ముస్లిం ఒకరు టెర్రరిస్టుల నుంచి యాత్రికులను కాపాడేందుకు ప్రయత్నించి టెర్రరిస్టుల చేతుల్లో హతమయ్యాడు. ఈ దారుణ సంఘటనకు వ్యతిరేకంగా కశ్మీర్‌లో ముస్లింలు, హిందువులు బంద్ పాటించారు. అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు జరిపారు. 'హిందు ముస్లిం ఐక్యత' నినాదాన్ని ప్రదర్శనల్లో ఇచ్చారు. అనేక చోట్ల కశ్మీరులో ముస్లింలు, హిందువులు ఇతర గ్రూపులు కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు. మృతులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. ప్రధాని మోదీ కశ్మీర్‌లో పర్యటనకు వెళ్లవలసి ఉంది. అయితే అంతక్రితమే ఆయన కశ్మీర్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. టెర్రరిస్టులు యాత్రికులపై దాడి జరిపిన సమయంలో మోదీ గల్ఫ్ దేశాలలో పర్యటిస్తున్నాడు. ఈ దుర్ఘటన తెలిసిన వెంటనే మోదీ పర్యటన అర్థాంతరంగా ముగించుకుని స్వదేశానికి చేరుకున్నారు. దుర్ఘటన జరిగిన ప్రాంతం కశ్మీర్‌లో పర్యటించకుండా బీహార్‌కు వెళ్లి ఒక ర్యాలీలో మాట్లాడారు. అక్కడ మాట్లాడేటప్పుడు టెర్రరిస్టులకు తీవ్రమైన హెచ్చరికలు చేశారు. ఈ పర్యటన రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసం జరిపిందే. టెర్రరిస్టులంతా ముస్లింలే అని, బాధితులు హిందువులని పరోక్షంగా ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడారు.

భారత్, పాకిస్థాన్ మధ్య సాయుధ ఘర్షణ జరుగుతుండగానే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని ప్రకటించాడు. భారతదేశ సైనికులు మొదటిరోజే పాకిస్థాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్‌లోను తొమ్మిది టెర్రరిస్టు స్థావరాలను ధ్వంసం చేశాయి. అలాగే పాకిస్థాన్ విమానాశ్రయాలలోను దాడులు జరిపి నష్టం కలిగించాయి. నాలుగు రోజులు సాయుధ ఘర్షణ జరిగింది. దాదాపు 70 మందికి పైగా టెర్రరిస్టులను చంపివేసినట్టు భారత సైనికాధికారులు ప్రకటించారు. నాలుగవ రోజు దాడులు జరుగుతుండగానే ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని తానే కుదిర్చానని ప్రకటించాడు. ఆ తర్వాతనే రెండు దేశాల ప్రకటనలు వెలువడ్డాయి. ట్రంప్ చేసిన ప్రకటన మన దేశాన్ని అవమానించడమే అయింది. ప్రత్యేకించి తన స్నేహితుడని చెప్పుకుంటున్న నరేంద్రమోదీ ఇంతవరకు ఈ ఘటనపై మాట్లాడనే లేదు. కాల్పుల విరమణపై కూడా మోదీ ప్రకటన చేయలేదు. సైనికాధికారులు, విదేశాంగ శాఖ కార్యదర్శి మిస్రీ ప్రకటించారు. ఈ ప్రకటన చేసినందుకు మిస్రీని హిందూ మతోన్మాదులు తీవ్రంగా అవమానించారు. మోదీ ప్రభుత్వ అనుకూల మీడియా సంస్థలు దేశ వ్యాప్తంగా విద్వేష ప్రచారాన్ని నిర్వహించాయి. అంతే కాకుండా పాకిస్థాన్‌లో వివిధ నగరాలను మన సైన్యం ధ్వంసం చేసిందని తప్పుడు ప్రచారాన్ని చేశాయి. అసలు విషయాలను తెలుసుకోకుండానే సంస్థలు దుష్ట ప్రచారాన్ని సాగించాయి. ఈ సంస్థలు ఊహించలేనంతగా దిగజారిపోయాయి. జర్నలిజం నైతిక సూత్రాలను మోదీ అధికారానికి వచ్చిననాడే విస్మరించాయి.

ఈ దుర్ఘటనకు ఎటువంటి సంబంధం లేకుండానే భారతదేశానికి అనుకూలంగా ప్రదర్శనలు జరిపిన ముస్లింలపై మితవాదులు విద్వేషాన్ని వెళ్లగక్కారు. గతంలో ఏనాడు లేనంతగా చాలా చోట్ల దాడులు చేశారు. మహారాష్ట్రలోని లాతూర్‌లో ముస్లింలను పాకిస్థానీ, కశ్మీరీలు అంటూ చితక్కొట్టారు. బాగా దెబ్బలు తిన్న ఒక ముస్లిం అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఉత్తరాఖండ్ హాస్టల్లో ఉంటున్న కశ్మీరీ విద్యార్థులను అర్థరాత్రి వచ్చిన మితవాదులు బయటకు నెట్టి వేశారు. తక్షణం డెహ్రాడూన్ విమానాశ్రయానికి వెళ్లి అక్కడ నుంచి కశ్మీర్ వెళ్లాలని ఆదేశించారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర బీజేపీ మంత్రి విజయ్‌షా సైనిక కల్నల్ సోఫియా ఖురేషీని తీవ్రంగా అవమానించారు. టెర్రరిస్టుల సిస్టర్ (టెర్రరిస్టుల సోదరి) అని మంత్రి వ్యాఖ్యానం చేశారు. ఆ తరువాత నామకః క్షమాపణలు చెప్పారు. ముంబైలో సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం కేంద్రంలో పని చేస్తున్న మిథిలారౌత్ దైనిక్ లోక్‌సత్తా (మరాఠీ) పత్రికలో పహల్గాంలో జరిగిన టెర్రరిస్టుల దుర్మార్గపు దాడిని ఉటంకిస్తూ వ్యాసం రాశారు. ఈ దుర్ఘటన అనంతరం అనేక చోట్ల ముస్లింలపై దాడుల సంఘటనలు జరిగాయి.

దేశ స్వాతంత్ర్యం తరువాత ఇండియా, పాకిస్థాన్‌లు ఏర్పడ్డాయి. రెండు దేశాలను ఏర్పాటు చేయాలని ముందుగా హిందూత్వ భావజాలకుడు వినాయక్ దామోదర్ సావర్కర్ కోరాడు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రతి సందర్భంలోనూ ముస్లింలపై ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. శాంతి పథంలో నడవడం భారత్ పాకిస్థాన్‌లకు ఆవశ్యం. భారతదేశం శాంతినే కోరుకొంటోంది.

ఉత్తరప్రదేశ్‌లోనే ఎక్కువ చోట్ల దాడులు జరిగాయి. అక్కడ షమ్లీ పరిధిలోని టోడ గ్రామంలో సర్ఫరాజ్ పైన గోవింద్ అనే వ్యక్తి దాడి చేశాడు. మా వాళ్లు 26 మందిని మీరు చంపివేశారు. అందుకు బదులుగా మేము 26 మంది చంపివేస్తామని మాట్లాడారు. అలాగే పంజాబ్‌లో దేరాబస్సీ ప్రాంతంలోని యూనివర్సల్ గ్రూపు సంస్థల్లోని హాస్టళ్లలో కశ్మీర్ విద్యార్థులు ఉన్నారు. వారిపైన కూడా మితవాదులు దాడి చేశారు. ముస్సోరిలో శాలువాలు అమ్ముకునే కశ్మీర్‌కు చెందిన వ్యక్తి షబ్బీర్‌ధర్ పైన కూడా దాడి జరిగింది. షాపులో పనిచేసే వ్యక్తిని నీవు దోషివి పహల్గాంలో హత్యలు చేశావు అంటూ బయటికి లాగి మరొకసారి తిరిగి రావద్దని బెదిరించారు. హర్యానాలోని రోహ్‌తక్ గ్రామంలో నివసిస్తున్న ముస్లింలను మే 2 వ తేదీలోపు గ్రామాన్ని విడిచి వెళ్లిపోవాలని బెదిరించారు. ఇంకా అనేక ఇలాంటి విద్వేష ఘటనలను వివిధ పత్రికలలో ప్రచురించారు. క్రమంగా సమాజం అంతటా పరిస్థితి తీవ్రంగా దిగజారిపోతోంది.

హిందూమతోన్మాదులు కొందరు ఇప్పటికే దేశంలో ముస్లిం వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించారు. ముస్లింలు శత్రువులన్న వాతావరణాన్ని ఆర్ఎస్ఎస్ శాఖలు, గోదీ మీడియా, సోషల్ మీడియా ప్రచారం చేశాయి. పాకిస్థాన్‌ను ముస్లింలు ఏర్పాటు చేసుకున్నారని ముస్లింలంతా అక్కడకే వెళ్లిపోవాలని ప్రచారం సాగింది. దేశ స్వాతంత్ర్యం తరువాత ఇండియా, పాకిస్థాన్‌లు ఏర్పడ్డాయి. రెండు దేశాలను ఏర్పాటు చేయాలని ముందుగా హిందూత్వ భావజాలకుడు వినాయక్ దామోదర్ సావర్కర్ కోరాడు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రతి సందర్భంలోనూ ముస్లింలపై ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. శాంతి పథంలో నడవడం భారత్ పాకిస్థాన్‌లకు ఆవశ్యం. భారతదేశం శాంతినే కోరుకొంటోంది.

గోదావరి బనకచర్ల రెండు దశలుగా చేపట్టాలి



వి. శంకరయ్య

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టువదలని విక్రమార్కుడులాగా గోదావరి బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పట్టాలకెక్కించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. త్వరలోనే పరిపాలన అనుమతి ఇస్తారని చెబుతున్నారు. ప్రీ ఫిజిబిలిటీ రిపోర్టును కేంద్ర జల సంఘానికి పంపనున్నట్లు తెలిసింది. పర్యావరణ అనుమతుల సాధనకు అప్లై చేయమని అధికారులను ఆదేశించినట్లు తొలి దశలో వార్తలు వచ్చినా తాజాగా టెండర్లు పిలిచి కాంట్రాక్టరుకే బాధ్యత అప్పగించే ఆలోచన వున్నట్లు ఇప్పుడు వార్తలు వెలువడ్డాయి. ఈ పథకం అమలు గురించి ప్రభుత్వ నిర్ణయాలుగా మీడియాలో వెలువడుతున్న వార్తలు కీలకమైన అంశాలను తెరమీదకు తెస్తున్నాయి. ఇందులో కొన్ని సాంకేతికపరమైనవైతే, మరికొన్ని ఏ ప్రాంతానికైతే అనుసంధాన పథకం ఉద్దేశిస్తున్నారో రాయలసీమ ప్రాంత ప్రజల మనోభావాలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీనికి తోడు నిధుల సమస్య వుండనే వుంది. కేంద్ర ప్రభుత్వ సాయం గురించి ఎక్కువగా ప్రచారముంది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ రంగంలో ఇది వరకు లేని విధంగా కాంట్రాక్టు సంస్థలు కూడా కొంత పెట్టుబడి పెట్టే విధానం ఈ పథకంలో అమలు జరుగుతున్నదని ప్రచారముంది. కేంద్ర సాయం గురించి చర్చించడం ఇప్పుడు అపరిపక్వ దశ. ఇవన్నీ కూడా ఒక దానికొకటి అవినాభావ సంబంధం కలిగి వున్నాయి.

మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం ప్రాజెక్టు మొత్తం ఒకే ప్యాకేజీగా పరిపాలనా అనుమతి ఇవ్వాలని కోరుతున్నారని తెలుస్తోంది. నేడున్న పరిస్థితుల దృష్ట్యా ఇది శ్రేయస్కరం కాదు. సాంకేతికంగానూ (పర్యావరణ అనుమతులు సాధించడంలో) లబ్ధిదారులైన రాయలసీమ ప్రజల మనోభావాలు పరిగణనలోకి తీసుకుంటే ఈ పథకం గోదావరి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు తొలి దశగానూ మిగిలిన భాగం రెండవ దశగా పరిపాలన అనుమతి ఇస్తే సానుకూలంగా వుంటుంది. ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు తర్వాత రెండవ దశ భవిష్యత్తు నిర్ణయించడం ఉత్తమం. ఎందుకంటే గోదావరి జలాలు కృష్ణాడెల్టా సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు ఉపయోగించి తద్వారా మిగిలే కృష్ణా జలాలు ఎట్టి ఎత్తిపోతలు భారీ వ్యయం లేకుండా శ్రీశైలం జలాశయం నుంచి తమకు బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా ఇవ్వాలని రాయలసీమ వాసులు ప్రగాఢంగా కోరుకుంటున్నారు. రాయలసీమలో పార్టీలతో నిమిత్తం లేకుండా ఈ అభిప్రాయం బలంగా ఉంది. ఇందుకు ప్రాతిపదిక వుంది. బొల్లాపల్లి బనకచర్ల అనుసంధానం క్లిష్టమైనది. ఎక్కువ నిర్మాణ కాలం తీసుకొంటుంది. అదీకాకుండా తమ ఇంట ముంగిట నుంచి వెళ్లే కృష్ణానది నీళ్లు వదలి పెట్టి ఎత్తిపోతలతో గోదావరిజలాలు తీసుకురావడంపై రాయలసీమలో తీవ్రమైన వైముఖ్యం వుంది. కృష్ణాజలాలపై రాయలసీమ వాసుల్లో వున్న భావోద్వేగాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిగణనలోకి తీసుకొంటే మున్ముందు రాజకీయంగా ఎంతో ఉపయుక్తంగా వుంటుంది. ఈ జనాభిప్రాయాన్ని టీడీపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు లేదు. కనీసం మంత్రులైనా ధైర్యంచేసి చెప్పవలసి ఉంది. బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు వ్యయం చేయదలచిన నిధులు రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులకు వెచ్చించితే త్వరితగతిన నిత్య క్షామపీడిత ప్రాంతానికి సాగు, తాగు నీరు పుష్కలంగా అందించవచ్చని భావిస్తున్నారు. ఇది జరగాలంటే ముందుగా ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ వద్ద బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు కాపాడుకోవలసి వుంది. ఇది రాష్ట్ర సాగునీటి రంగానికే కీలకమైనది. ఇందుకు కొంతకాలం పట్టే అవకాశం వున్నందున దాన్ని దృష్టిలో పెట్టుకొని గోదావరి బనకచర్ల అనుసంధానం రెండు దశలుగా విభజించి ప్రకటించితే ఈ ఇబ్బందులు అధిగమించవచ్చు. కేంద్ర జల సంఘం ఆమోదం లేకున్నా పర్యావరణ అనుమతులు తీసుకుని టెండర్లు పిలిస్తే ఎంతోకొంత అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. అదీ కాకుండా బొల్లాపల్లి వరకైతే సులభంగా పర్యావరణ అనుమతులు లభిస్తాయి. అదే సమయంలో రాయలసీమ ప్రాంత ప్రజలు మనోభావాలను పరిగణనలోకి తీసుకొన్నట్లవుతుంది.

కేంద్ర జల సంఘానికి ప్రీ ఫిజిబిలిటీ నివేదిక పంపే సమయంలోనే పర్యావరణ అనుమతులు పొందాలి. పర్యావరణ అనుమతులు పొందకుండా టెండర్లకు వెళ్లడం ఏమాత్రం క్షేమం కాదు. రాయలసీమ ఎత్తిపోతలు పథకం అనుభవం మన కళ్ల ముందు వుంది. తెలంగాణ ప్రభుత్వం వేపు నుంచే కాకుండా కేసీఆర్ అనుచరగణం అదును కోసం కాచుకొని వున్నారు. తెలంగాణలో చాలా



పథకాలకు కేంద్ర జలసంఘం అనుమతి లేకున్నా ఇతర పర్యావరణ అనుమతులు చాకచక్యంగా సాధించారు. ఈ ఐదేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో అట్టి కృషి జరగలేదు. గతంలో కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం వున్న రోజుల్లో ఎగువ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించేందుకు మొత్తం పది రోజుల్లో పని పూర్తిచేశారు. పది మంది కార్యదర్శులు సమావేశమై ఆగమేఘాల మీద ఆమోదం తెలిపారు. ఇంతకీ పోలవరం అనుభవం చూస్తున్న రాయలసీమ వాసులు ప్రధానంగా బొల్లాపల్లి బనకచర్ల అనుసంధానం ఈతరంలో పూర్తి కాదేమోనని అనుమానించడాన్ని తప్పు పట్టలేము. ఈ సందర్భంగా రెండు కీలక అంశాలు వున్నాయి. గోదావరి బనకచర్ల అనుసంధానంలో గోదావరి బొల్లాపల్లి వరకు నిధులు వుంటే త్వరితగతిన పూర్తి చేయవచ్చు. కాని బొల్లాపల్లి నుంచి బనకచర్ల అటవీ ప్రాంతమే కాకుండా వన్య ప్రాణుల సంరక్షణ ప్రాంతంగా వుండే అడవి పథక నిర్మాణ పరిధిలోనికి వస్తుంది. ప్రాథమికంగా అందే సమాచారం మేరకు ఈ ప్రాంతంలో మూడు నాలుగు ఎత్తిపోతలతోపాటు కిలోమీటర్ల కొద్దీ టన్నెల్స్ తవ్వవలసి వుంది.

టన్నెల్స్ అనగానే యంత్రాలతో తవ్వినా ఎదురయ్యే ఇబ్బందులు అటుంచి ప్రధానంగా ఫాల్ట్ జోన్ సమస్య వెన్నాడుతుంది. గాలేరు నగరి తొలిదశలోనూ, వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్స్‌కు ఫాల్ట్ జోన్ ఏర్పడి కాలహరణం తీసుకొంది. పైగా కృష్ణానదికి ఆవల తెలంగాణలో నిర్మాణంలో వున్న శ్రీశైలం ఎడమ కాలువ అనుభవం తోసిపుచ్చలేము. ఏ పథకం నిర్మాణ సమయంలోనైనా వేరు గత్యంతరం లేకపోతే టన్నెల్స్ తవ్వడం తప్పదు. గోదావరి బనకచర్ల అనుసంధానానికి ప్రత్యామ్నాయ మార్గం వున్నప్పుడు రిస్క్ తీసుకోవడం ఎందుకు? ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇంజినీరింగ్ అధికారులు గత అనుభవాలను సోదాహరణంగా వివరిస్తే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే ఈ పథకానికి విఘ్నాలు తప్పుతాయి. పైగా ఈ ప్రభుత్వం కాలపరిమితి ఈపాటికే సంవత్సరం గడచిపోయింది. అవసరమైన అనుమతులు సాధించడం టెండర్లు పిలిచి కాంట్రాక్టరు నిర్ధారణతోపాటు డిజైన్‌లు రూపకల్పన జరిగి కాంట్రాక్టర్ తట్టాబుట్ట సర్దుకొనే సరికి ఎట్ల లేదన్నా ఈ సంవత్సరం గడచి పోతుంది. పైగా పోలవరం కుడి కాలువ కాకుండా సమాంతరంగా మరొక కాలువ ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో భూసేకరణ అంత సులభం కాదు. మిగిలినది నికరంగా మూడు సంవత్సరాలైనా 2028 ఆఖరుకు తిరిగి ఎన్నికల వాతావరణం వచ్చేస్తుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొనే వైసీపీ హయాంలో మోసం జరిగినట్లు ఈ ప్రభుత్వ హయాంలో కూడా అన్యాయం జరుగుతుందేమోననే భయాందోళనలు రాయలసీమ ప్రాంతంలో వ్యక్తమౌతున్నాయి.

ఈ నేపథ్యంలో రెండు దశలుగా చేపడితే ఈ టర్మ్ లోపు తొలి దశ ఇంచుమించు ఒక స్వరూపానికి తీసుకురావచ్చు. ఈ లోపు ట్రిబ్యునల్ తీర్పు వస్తుంది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల నుంచి శ్రీశైలం జలాశయం ద్వారా రాయలసీమకు భేషుగ్గా పుష్కలంగా నీళ్లు ఇచ్చే అవకాశం లభ్యమౌతుంది. ఇంత భారీ వ్యయంతో నిర్మించదలచిన గోదావరి బనకచర్ల అనుసంధానానికి డీపీఆర్ ఆమోదం పొందటంలో ఇబ్బందులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఇంజినీరింగ్ అధికారులు తెలియచేశారో లేదో తెలియదు. అన్ని అభ్యంతరాలు దాటుకొని కేంద్ర జల సంఘం వద్ద ఆమోదం పొందటం వైతరణీ నదిని దాటడమే. రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుంచి నిధులు వ్యయం చేయనట్లయితే కేంద్ర జల సంఘం ఆమోదం లేకున్నా ముందుకు పోవచ్చు. ఇతర సంస్థల పెట్టుబడులు అవసరమైతే కేంద్ర జలసంఘం ఆమోద ముద్ర తప్పనిసరని వేరుగా చెప్పేపనిలేదు. ఇంతకీ ఇటీవల వరకు తమిళనాడులో రాజకీయంగా పాగా వేసేందుకు గోదావరి కావేరి అనుసంధానం పథకం గురించి కేంద్ర ప్రభుత్వం పట్టుదలగా వుంది. ఒకవేళ తిరిగి కేంద్ర ప్రభుత్వం ఈ పామును బుట్టలో నుంచి బయటికి తీస్తే గోదావరి బనకచర్ల అనుసంధానం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇన్ని సమస్యల సుడిగుండంలో వున్న ఈ పథకాన్ని ఎలా గట్టెక్కిస్తారో వేచి చూడాలి!

విశ్రాంత పాత్రికేయులు

రూ.6 వేల కోట్ల దారిమళ్లింపు: ఈడీ

న్యూఢిల్లీ: కోల్‌కతా జోనల్ ఆఫీసుకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ... యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోద్ కుమార్ గోయల్‌ను ఈ నెల 16న అరెస్టు చేసింది. అతడు అక్రమ రీతిలో బ్యాంకుకు చెందిన సుమారు రూ.6,210.72 కోట్లు దారి మళ్లించినట్లు ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టిన ఈడీ అనేక విషయాలను వెల్లడించింది. కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ సంస్థకు భారీగా క్రెడిట్ సౌకర్యాలు కల్పించినట్లు ఈడీ తన పేర్కొంది. ఆ అక్రమ రుణాల మొత్తం ఆరు వేల కోట్లు ఉంటుందని అంచనా వేసింది. అరెస్టు చేసిన సుబోద్ కుమార్ గోయల్‌ను మనీల్యాండరింగ్ కోర్టు ముందు ఈ నెల 17న హాజరుపరిచారు. బుధవారం వరకు ఈడీ కస్టడీకి అప్పగించారు. ఏప్రిల్‌లోనే గోయల్‌తో సంబంధం ఉన్న ప్రాపర్టీలపై ఈడీ దాడులు చేసింది. సీఎస్‌పీఎల్ సంస్థకు క్రెడిట్ ఫెసిలిటీ ఇచ్చిన అంశంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. బ్యాంకు రుణాలను అక్రమ రీతిలో దారిమళ్లించిన గోయల్‌కు నగదు, స్థిరాస్తులు, లగ్జరీ వస్తువులు, హోటల్ బుకింగ్‌లు అనుకూలంగా వచ్చినట్లు తెలుస్తోంది. షెల్ కంపెనీలు, డమ్మీ వ్యక్తులు ద్వారా ఆ లావాదేవీలు జరిగాయి. షెల్ కంపెనీల ద్వారా కొనుగోలు చేసిన ప్రాపర్టీ వివరాలను కూడా గుర్తించినట్లు ఈడీ తన ప్రకటనలో పేర్కొంది . లబ్ది పొందిన ఆస్తులను సుబోధ్ కుమార్ ఆధీనంలో ఉన్నట్టు తేలింది. సీఎస్‌పీఎల్‌తో ఆ ప్రాపర్టీలకు లింకు ఉన్నట్లు గుర్తించారు.

పూజా ఖేద్కర్‌కు 'సుప్రీం' ముందస్తు బెయిల్

న్యూఢిల్లీ: ఐఏఎస్ ప్రొబెషనరీ అధికారి పూజా ఖేద్కర్‌కు... సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. ఆమెపై మోసపూరిత కేసు నమోదైంది. తప్పుడు ఓబీసీ సర్టిఫికేట్... దివ్యాంగుల కోటా ద్వారా సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలైనట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆ కేసును బుధవారం సుప్రీం విచారించింది. జస్టిస్ బీవీ నాగరత్న, సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ... విచారణకు సహకరించాలని పూజా ఖేద్కర్‌ను కోరారు. ఆమె ఏం నేరం చేసిందని, ఆమె డ్రగ్‌లార్డ్ కాదు అని, ఉగ్రవాది కాదు అని, ఆమె 302 సెక్షన్ కింద నేరం చేసిందా, ఎన్డీపీఎస్ నేరానికి పాల్పడిందా విచారణను పూర్తి చేయండి, ఆమె అన్నీ కోల్పోయిందని, ఆమెకు ఎక్కడా ఉద్యోగం దొరకదని సుప్రీం బెంచ్ తన తీర్పులో పేర్కొంది. కేసుకు సంబంధించిన పూర్వోపరాలను దృష్టిలో పెట్టుకుని, దిల్లీ హైకోర్టు పిటీషనర్‌కు బెయిల్ ఇవ్వాల్సి ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఖేద్కర్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని దిల్లీ పోలీసుకు చెందిన లాయర్ వ్యతిరేకించారు. ఆమెపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని, ఆమె విచారణకు సహకరించడం లేదన్నారు. 2022 యూపీఎస్సీ అప్లికేషన్‌లో తప్పుడు సమాచారం పొందుపరిచినట్లు ఖేద్కర్‌పై ఆరోపణలు ఉన్నాయి. తనపై వచ్చిన ఆరోపణలను ఆమె తిప్పికొట్టింది. కానీ యూపీఎస్సీ మాత్రం ఖేద్కర్‌పై చర్యలు తీసుకుంది. క్రిమినల్ కేసు దాఖలు చేసింది. ఫేక్ ఐడెంటిటీ ఇస్తూ సివిల్ సర్వీసు పరీక్షకు హాజరైనట్లు ఆరోపించింది. దిల్లీ పోలీసులు కూడా ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మరో పాక్ అధికారి బహిష్కరణ

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు చెందిన మరో అధికారిని భారత్ బహిష్కరించింది. 24 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రప్రభుత్వం ఆయనకు ఆదేశాలిచ్చింది. హోదాకు తగినట్లుగా నడుచుకోనందునే ఆయనపై చర్యలు తీసుకున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. పాక్ హైకమిషన్ నుంచి బహిష్కరణకు గురైన రెండవ అధికారిగా ఈయన నిలిచారు. గూఢచర్యానికి పాల్పడుతున్నారనే అభియోగంపై ఓ అధికారిని కేంద్రం ఇటీవల బహిష్కరించింది.

రెండున్నరేళ్లలో 'చంద్రయాన్ 4'

ఇస్రో చైర్మన్ డా.నారాయణన్

భువనేశ్వర్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రస్తుతం చంద్రయాన్-4, చంద్రయాన్-5, గగన్‌యాన్‌పై పని చేస్తోంది. మరో రెండున్నరేళ్లలో చంద్రయాన్-4 ప్రయోగం చేపట్టనుంది. ఈ మేరకు ఇస్రో చైర్మన్ డా.నారాయణన్ ప్రకటించారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో గల సీటీటీసీ లో వర్క్‌షాప్‌లను సందర్శించిన ఆయన, ఇస్రో భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి కీలక విషయాలు వెల్లడించారు. ప్రస్తుతం ఒడిశా పర్యటనలో ఉన్న ఇస్రో చైర్మన్, భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్‌రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (సీటీటీసీ)ను బుధవారం సందర్శించారు. ప్రస్తుతం ఇస్రో వద్ద 56 కార్యాచరణ ఉపగ్రహాలు ఉన్నాయని తెలిపారు. వాటిలో చాలా వరకు దేశ భద్రత కోసం ఉపయోగిస్తామని చెప్పారు. సరిహద్దు భద్రతతో పాటు ఆహార భద్రత, నీటి భద్రత, టెలి-విద్య, వాతావరణంపై ఇస్రో పనిచేస్తోందని వెల్లడించారు.

"ప్రస్తుతం చంద్రయాన్-4, చంద్రయాన్-5 పై ఇస్రో పని చేస్తోంది. చంద్రయాన్-4 నమూనా సేకరణ మిషన్ రెడీ అవుతుంది. మొదటిసారిగా ఆ మిషన్ చంద్రుని నుంచి నమూనాలను సేకరించి దేశానికి తిరిగి వస్తుంది. ఆ తర్వాత చంద్రయాన్-5ను జపాన్?తో కలిసి ప్రయోగిస్తుంది ఇస్రో. చంద్రయాన్-3 ల్యాండర్ బరువు 1600 కిలోలు, రోవర్ బరువు 25 కిలోలు. చంద్రయాన్-5 ల్యాండర్ బరువు 6400 కిలోలు, రోవర్ బరువు 350 కిలోలు. చంద్రయాన్-3 జీవితకాలం 14 రోజులు, చంద్రయాన్-5 జీవితకాలం 100 రోజులు ఉంటుంది" అని నారాయణన్ తెలిపారు.

రాబోయే రెండున్నర సంవత్సరాల్లో చంద్రయాన్-4 ప్రయోగం ఉండనుందని నారాయణన్ చెప్పారు. ఇస్రో గగన్‌యాన్‌పై కూడా పని చేస్తోందన్నారు. మొదటి సిబ్బంది రహిత మిషన్ ఈ సంవత్సరం ఉంటుందని, ఆ తర్వాత 2027 మొదటి త్రైమాసికంలో మరో రెండు సిబ్బందితో కూడిన మిషన్లు అంతరిక్షానికి వెళ్తాయని చెప్పారు. నాసాతో భాగస్వామ్యంలో రెండు మిషన్లు ఉంటాయని చెప్పారు. ఇస్రో అంతరిక్షంలో తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని అభివృద్ధి చేస్తోందని వెల్లడించారు. అంతరిక్ష కేంద్రం బరువు 52 టన్నులు ఉంటుందని చెప్పారు. భారతీయ అంతరిక్ష కేంద్రం 2028లో స్థాపిస్తామని పేర్కొన్నారు.

'ఉపాధి'పై నిర్లక్ష్యమా?

- 7శాతం కుటుంబాలకే 100రోజుల పని
- బడ్జెట్‌లో తగినన్ని నిధుల్లేవ్
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ : ఉపాధి హామీ పథకం అమలు విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఉపాధి పథకంపై కొత్త నివేదిక ఫలితాలను ఉదహరించడం ద్వారా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ) అమలులో కీలక లోపాలను ఎత్తిచూపుతూ మోదీ సర్కారుపై విమర్శల దాడి చేసింది. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్... లిబ్‌టెక్ ఇండియా నివేదికలోని ఫలితాలను ఎత్తి చూపుతూ, ఉపాధి పథకం కింద వాగ్దానం చేయబడిన 100 రోజుల పనిని కేవలం ఏడు శాతం కుటుంబాలకు మాత్రమే పొందుతున్నారని తెలిపారు. పథకం కవరేజ్ పెరుగుతున్నప్పటికీ... బహుశా కొనసాగుతున్న ఆర్థిక మాంద్యం కారణంగా ఎక్కువ కుటుంబాలు ఈ ఉపాధిని కోరుకోవడం వల్ల కావచ్చు. 2023-2024 ఆర్థిక సంవత్సరం, 2024-2025 ఆర్థిక సంవత్సరం మధ్య ప్రతి కుటుంబానికి సగటు ఉపాధి రోజులు తగ్గాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక మాంద్యం తీవ్రతరం కావడంతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ కింద దార్శనికతను సాకారం చేసుకోవడానికి బడ్జెట్‌లో తగిన ఆర్థిక కేటాయింపులు చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఉపాధి వేతనాలను ప్రభుత్వ ఏకపక్ష ఇష్టాల ద్వారా నిర్ణయించలేమని, వేతన రేటులో మార్పుల అవసరాన్ని అంచనా వేయడానికి ఒక స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ పథకం కింద నమోదయిన కుటుంబాల సంఖ్య 8.6 శాతం పెరిగినప్పటికీ, 2024-25లో ఉపాధి 7.1 శాతం తగ్గిందని లిబ్‌టెక్ నివేదిక ఎత్తి చూపింది. సగటు పని దినాలు 4.3 శాతం తగ్గాయని, 100 రోజుల పూర్తి చేసిన కుటుంబాలు 11.9 శాతం తగ్గాయని కూడా పేర్కొంది. ఉపాధి అమలులో లిబ్‌టెక్ నివేదిక అనేక కీలకమైన అంతరాలను నమోదు చేసిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్లక్ష్యం, హ్రస్వదృష్టికి తొలి సూచనలలో ఒకటి 2015లో పార్లమెంటులో ఉపాధి పథకాన్ని ఆయన అపహాస్యం చేయడం' అని అన్నారు. 'ఆ తరువాత సంవత్సరాలలో ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి సమయంలో ప్రభుత్వం అమలు చేయగల కొన్ని సామాజిక భద్రతా జోక్యాలలో ఒకటిగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ దాని ప్రయోజనాన్ని నిశ్చయంగా ప్రదర్శించింది. 2019-20లో మహమ్మారి రాకముందు ఈ పథకం కింద పనిని అభ్యర్థిస్తున్న మొత్తం 6.16 కోట్ల కుటుంబాలు ఉండగా, 2020-2021 నాటికి ఈ సంఖ్య దాదాపు 33 శాతం పెరిగి 8.55 కోట్లకు చేరుకుంది. ఈ కోట్లాది కుటుంబాలకు, ప్రభుత్వం ప్రణాళిక లేని లాక్‌డౌన్‌ల గందరగోళం మధ్య ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ ఏకైక జీవనాధారం' అని ఆయన పేర్కొన్నారు. లిబ్‌టెక్ నివేదిక నేడు ఉపాధి పథకం స్థితి గురించి కొన్ని సంబంధిత డేటా పాయింట్లను వెల్లడిస్తుందన్నారు.

'ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ బడ్జెట్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.86,000 కోట్లు సరిపోదని విస్తృతంగా పరిగణించబడుతోంది. పీపుల్స్ యాక్షన్ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ (పీఏఈజీ) 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కోసం రూ.2.64 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపును సిఫార్సు చేసింది. ప్రపంచ బ్యాంకు జీడీపీలో కనీసం 1.7 శాతం ఈ కార్యక్రమానికి కేటాయించాలని సిఫార్సు చేసింది. ప్రస్తుత కేటాయింపులు 2024-25 నాటికి జీడీపీలో 0.26 శాతం' అని జైరాం రమేశ్ వివరించారు. ఉపాధి కార్మికులను అనేక సంవత్సరాలుగా ఏకపక్షంగా తొలగించిన తర్వాత పౌర సమాజం, ప్రతిపక్ష పార్టీల నుంచి నిరంతర ఒత్తిడి చివరకు మోదీ ప్రభుత్వం తొలగించిన జాబ్ కార్డులను పునరుద్ధరించాల్సి వచ్చిందని అన్నారు. అయితే కొన్ని సంవత్సరాలుగా లబ్ధిదారులపై జరిగిన నష్టాన్ని పూడ్చడానికి చేర్పుల వేగాన్ని కొనసాగించాలన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా ఫిబ్రవరి 14, 2024న జార్ఖండ్‌లోని రాంకాలో జరిగిన జన్ సున్వైలో దేశ వ్యాప్తంగా ఉన్న ఉపాధి కార్మికులు ఈ సమస్యలను లేవనెత్తారని ఆయన గుర్తు చేశారు. కానీ ఎనిమిది నెలల తర్వాత కూడా ఈ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయని, ఇది ప్రభుత్వం సృష్టించిన మానవ, ఆర్థిక, సంస్థాగత విషాదం అని ఆయన అన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకం అమలులో అనేక కీలక మార్పులను కాంగ్రెస్ పార్టీ నిరంతరం డిమాండ్ చేస్తోంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వీటిలో చాలా వాటిని ప్రతిధ్వనిస్తుంది' అని తెలిపారు. తీవ్రమవుతున్న ఆర్థిక మాంద్యం దృష్ట్యా, బడ్జెట్ ఈ దార్శనికతను సాకారం చేసుకోవడానికి తగిన ఆర్థిక కేటాయింపులు చేయాలన్నారు. 'దశాబ్ద కాలంగా వేతనాలు నిలిచిపోయిన సంక్షోభం మధ్య 2024 లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ న్యాయ్ పాత్రలో ఊహించినట్లుగా ఉపాధి పథకం వేతనాల పెరుగుదల కొత్త ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ పథకం కింద వేతనాలు రోజుకు రూ.400కి చేరుకోవాలి' అని పేర్కొన్నారు. ఆధార్ ఆధారిత చెల్లింపు వంతెన వ్యవస్థలు తప్పనిసరి చేయరాదని, 15 రోజుల చట్టబద్ధమైన వ్యవధిలోపు వేతనాలు చెల్లించాలని, చెల్లింపులో ఏదైనా జాప్యం జరిగితే పరిహారం చెల్లించాలని, పని దినాల సంఖ్యను 100 నుంచి 150 రోజులకు పెంచాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

మాల్వియా... గోస్వామిపై చర్యలు తీసుకోవాలి

పార్టీ, దాని నాయకుడు రాహుల్ గాంధీపై పరువు నష్టం కలిగించే పోస్టులకు ఫిర్యాదులు దాఖలైన క్రమంలో బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాల్వియా, జర్నలిస్టు అర్నాబ్ గోస్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. దిల్లీ, కర్నాటక సహా దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ ఇద్దరిపై ఫిర్యాదులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. 'ఎక్స్' లో చేసిన ఒక పోస్ట్‌లో, 'కాంగ్రెస్ పార్టీ... అమిత్ మాల్వియా, అర్నాబ్ గోస్వామిపై క్రిమినల్ ఫిర్యాదులు దాఖలు చేసింది. వీటిని ఇప్పుడు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌లుగా మార్చారు' అని తెలిపారు. 'ఇప్పుడు ఈ ఇద్దరూ రక్షణ కోసం కోర్టులకు పరుగెత్తుతారు. ఈ ఇద్దరి దురుద్దేశపూరిత చర్యల వల్ల దేశానికి జరిగిన గొప్ప దుష్ప్రవర్తన, హానిని కోర్టులు పరిశీలిస్తాయని మేము ఆశిస్తున్నాం' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

కర్నాటక మంత్రికి ఈడీ షాక్

బెంగళూరు: బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు కేసు కర్నాటక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కేసుకు సంబంధించి ఆ రాష్ట్ర హోం మంత్రి జి.పరమేశ్వర... చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తుమకూరులోని శ్రీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారులు సోదాలు చేపట్టారు. రన్యారావు కేసులో మనీలాండరింగ్‌పై దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులకు కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. రాన్యారావుకు, మెడికల్ కాలేజీకి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతో అధికారులు బుధవారం ఉదయం కళాశాలలో తనిఖీలు చేపట్టారు. కాలేజీకి సంబంధించిన రికార్డులు, ఆర్థిక లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈడీ సోదాలు చేపట్టిన సమయంలో మంత్రి పరమేశ్వర కాలేజీలో లేరని తెలిసింది.

రన్యారావుకు బెయిల్

బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయి బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర జైలులో ఉన్న రన్యారావుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమెతో పాటు తరుణ్ రాజ్ కొండూరుకూ బెంగళూరు కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది. వారిద్దరు చట్టబద్ధమైన బెయిల్‌కు అర్హులేనని, ఇద్దరు వ్యక్తుల నుంచి వ్యక్తిగత పూచీకత్తు, ఒక్కొక్కరు రూ.రెండు లక్షల వ్యక్తిగత బాండ్‌ను సమర్పించిన తర్వాత వారిని బెయిల్‌పై విడుదల చేయాలని ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని... దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని ఆదేశించింది.

స్థానిక భాషను గౌరవిస్తే ప్రజల్ని గౌరవించినట్టే

ఎస్‌బీఐ మేనేజర్ వైఖరిపై సిద్ధరామయ్య ఫైర్

బెంగుళూరు : కన్నడ భాష మాట్లాడలేకపోయిన బ్యాంక్ మేనేజర్‌ను బదిలీ చేసినట్లు సీఎం సిద్ధరామయ్య తెలిపారు. సూర్యనగర్ బ్రాంచీకి చెందిన బ్యాంక్ మేనేజర్ ప్రవర్తన సరిగా లేదని, స్థానిక భాషను గౌరవించడం అంటే ప్రజల్ని గౌరవించినట్లే అని పేర్కొన్నారు. ఆమెను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఎస్బీఐ వెంటనే తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ సమస్య ఇంతటితో ముగిసినట్లుగా భావించాలన్నారు. బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులు అందరూ కన్నడ భాషలో మాట్లాడాలన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగరాదు అని తెలిపారు. కస్టమర్లతో బ్యాంకు ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలని, స్థానిక భాష మాట్లాడే ప్రయత్నం చేయాలన్నారు. బ్యాంకు సిబ్బందికి సంస్కృతి, భాషా సంబంధిత అంశాల్లో శిక్షణ ఇప్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని సీఎం సిద్ధరామయ్య కోరారు. ఓ మహిళా బ్యాంక్ మేనేజర్ ... కస్టమర్ ఎంత కోరినా కన్నడ భాషలో మాట్లాడేందుకు నిరాకరించారు. ఇది కర్నాటక అని ఆ కస్టమర్ పేర్కొన్నా... నువ్వేమీ నాకు ఉద్యోగం ఇవ్వలేదని ఆ ఆఫీసర్ జవాబు ఇచ్చారు. ఇది కర్నాటక అని మరోసారి అనగా, ఇది ఇండియా అని ఆమె అన్నారు. నీ కోసం కన్నడ మాట్లాడను అని ఆమె అన్నారు. హిందీ మాత్రమే మాట్లాడతానని చెప్పారు. ఎస్బీఐ బ్రాంచీకి గుణపాఠం నేర్పాలని కస్టమర్ అరుస్తున్నట్లు వీడియోలో ఉన్నది. ఆ వీడియో వైరల్ కావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. కర్నాటకలోని స్టేట్ బ్యాంక్‌కు చెందిన ఓ మేనేజర్ .. కన్నడ భాషలో మాట్లాడేందుకు నిరాకరించింది. కస్టమర్‌తో హిందీ తప్ప మరో భాషలో మాట్లాడబోనని తేల్చి చెప్పింది. బ్యాంక్ మేనేజర్, కస్టమర్ మధ్య జరిగిన వాగ్వాదానికి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరలైన నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య తన ఎక్స్ అకౌంట్‌లో స్పందించారు.

జాతీయ విద్యావిధానంపై 'సుప్రీం'కు తమిళనాడు



చెన్నై: జాతీయ విద్యావిధానం అమలు ముసుగులో కేంద్రం తమపై హిందీ భాషను బలవంతంగా రుద్దుతోందని తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం తాజాగా సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. జాతీయ విద్యా విధానం అమలు చేయడం లేదన్న కారణంతో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ రాష్ట్రానికి రావాల్సిన రూ.2,151 కోట్ల నిధులను నిలిపివేసిందని కోర్టుకు తెలిపింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. పాఠశాల విద్య కోసం ఉద్దేశించిన సమగ్ర శిక్ష పథకం అవసరాలకు అనుగుణంగా తమిళనాడు ఉందని గతేడాది ఫిబ్రవరి 16న జరిగిన ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు సమావేశంలో కేంద్రం సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ తర్వాత ఈ పథకం కింద ఖర్చు కోసం రూ.3,585.99 కోట్ల నిధుల కేటాయింపు జరిగిందని పేర్కొంది. ఇందులో 60:40 నిష్పత్తి ప్రకారం, కేంద్రం వాటా రూ.2,151 కోట్లు అని తెలిపింది. ఈ నిధులు గత ఏడాది ఏప్రిల్ ఒకటోతేదీ నుంచే రాష్ట్రానికి చెల్లించాల్సి ఉందని తెలిపింది. అయితే, జాతీయ విద్యా విధానం అమలు చేయడం లేదన్న కారణంతో ఆ నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని పిటిషన్‌లో వివరించింది. జాతీయ విద్యావిధానం అమలుపై కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య గత కొంతకాలంగా ఘర్షణ వైఖరి జరుగుతోంది. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని స్టాలిన్ ప్రభుత్వం ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తోంది.

పాక్‌పై దౌత్య యుద్ధం ప్రారంభం

మొదలైన ఎంపీల విదేశీ యాత్ర

న్యూఢిల్లీ: పాకిస్థాన్ ఉగ్రవాద సంబంధాలను ప్రపంచ దేశాల ముందు ఉంచేందుకు భారత్ తన దౌత్య కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఏడు భారత ప్రతినిధి బృందాల్లో రెండు బృందాలు నిర్దేశిత దేశాలకు బుధవారం బయలుదేరాయి. జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని బృందం తొలుత ఇండోనేసియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ దేశాల్లో పర్యటించనుంది. ఈ బృందంలో బీజేపీ ఎంపీలు అపరాజిత సారంగి, బ్రిజ్ లాల్, హేమాంగ్ జోషి, ప్రదాన్ బారువా, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్, మాజీ దౌత్యవేత్త మోహన్ కుమార్ ఉన్నారు. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని మరో బృందం యూఏఈ, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సియెర్రా లియోన్, లైబీరియా దేశాలకు వెళ్లనుంది.

"పాకిస్థాన్ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. గత 40 ఏళ్లుగా దీని ప్రభావం మాపై పడుతోంది. ఉగ్రవాదం విషయంలో పాక్ వైఖరిని ప్రస్తుతం ప్రపంచవేదికలపై ఎండగట్టబోతున్నాం" అని సంజయ్ ఝా ప్రయాణానికి ముందు తెలిపారు. 140 కోట్ల భారతీయుల భద్రత విషయంలో తామంతా రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలుస్తామని చెప్పారు. పహల్గాంలో 26 మంది అమాయకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ "ఆపరేషన్ సిందూర్" కింద పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై వైమానిక దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ వాదనలను తిప్పికొట్టి, వాస్తవాలను ప్రపంచానికి వివరించేందుకు ఈ దౌత్య యాత్ర చేపట్టారు.

సెలవుల్లో పనికి లాయర్ల విముఖత: సీజేఐ

న్యూఢిల్లీ: లాయర్లు సెలవు దినాల్లో పని చేయడానికి ఇష్టపడటం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వేసవి సెలవుల అనంతరం తన కేసును విచారించాలని ఓ న్యాయవాది కోరారు. సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనానికి ఆ అభ్యర్థన ఆగ్రహం తెప్పించింది. 'న్యాయమూర్తులు సెలవుల్లో పనిచేస్తున్నారు. అయినా సరే పెండింగ్ కేసుల విషయంలో మమ్మల్ని నిందిస్తున్నారు. కానీ, సెలవుల్లో పనిచేయడానికి ఇష్టపడనిది న్యాయవాదులే' అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో పనిచేసే ధర్మాసనాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది.

కోల్‌కతాలో డ్రోన్ల వంటి వస్తువుల కలకలం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో ఇటీవల రాత్రి వేళల్లో ఆకాశంలో డ్రోన్లను పోలిన వస్తువులు కనిపిస్తుండటం కలకలం రేపింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నగర పోలీసులు ఈ ఘటనపై అప్రమత్తమయ్యారు. గూఢచర్యంతోపాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలోని హేస్టింగ్స్ ప్రాంతం, విద్యాసాగర్ సేతు తదితర ప్రాంతాల్లో దాదాపు 10 డ్రోన్ల వంటి వస్తువులు ఆకాశంలో ఎగురుతూ కనిపించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై నివేదిక అందిందని.. దర్యాప్తు కొనసాగుతోందని రక్షణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ అంశంపై కేంద్రం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుంచి నివేదిక కోరినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ డ్రోన్లను పోలిన వస్తువుల కదలికలను హేస్టింగ్ పోలీసుస్టేషన్ పోలీసులు మొదట గుర్తించారు. దక్షిణ 24 పరిగణాల జిల్లాలోని మహేస్తల వైపు నుంచి ఇవి వచ్చాయని తెలిపారు. ప్రత్యేక టాస్క్ ఫోర్స్, కోల్‌కతా డిటెక్టివ్ విభాగాలు దీనిపై దర్యాప్తు ప్రారంభించాయని వెల్లడించారు. ఈ డ్రోన్లు ఎవరికి సంబంధించినవి... వీటితో ఎవరైనా గూఢచర్యానికి పాల్పడుతున్నారా అనే విషయాలు దర్యాప్తులో తేలుతాయని అధికారులు తెలిపారు.

పాక్‌కు చాటింగ్‌లు, ఇ-మెయిల్స్‌పై నిఘా

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ మొదలైన నాటినుంచి జమ్మూకశ్మీర్ సహా సరిహద్దు రాష్ట్రాల నుంచి పాక్‌కు వెళ్లిన కమ్యూనికేషన్లపై కేంద్ర నిఘా సంస్థలు దృష్టిపెట్టాయి. దీనిలో భాగంగా అనుమానాస్పద ఫోన్ సంభాషణలు, చాటింగ్‌లు, ఇ-మెయిల్స్, మెసేజ్‌ల వివరాలను సేకరిస్తున్నాయి. భారత్‌లోనే ఉంటూ ఉగ్రవాదులకు సహకరిస్తున్న స్లీపర్ సెల్స్ వంటి వారి వివరాలు రాబట్టడమే దీని లక్ష్యం. ఈక్రమంలో ఇ-మెయిల్, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, చాటింగ్‌లు, ఎన్‌క్రిప్టెడ్, పాపులర్ సోషల్ మీడియా యాప్ ద్వారా జరిగిన కమ్యూనికేషన్ల వాల్యూమ్‌ల ఆధారంగా డేటా సేకరిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో 9 ఉగ్ర స్థావరాల ధ్వంసం తర్వాత భారత్‌లోని ఉగ్ర సానుభూతిపరులు వారి హ్యాండిలర్లు, ఐఎస్ఐ ఆపరేటివ్‌లతో అనుసంధానమయ్యారేమో గుర్తించేందుకు ఈ చర్యలు చేపట్టారు. ఇక పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెండు వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 12 మందిని అరెస్టు చేశారు. పంజాబ్‌లో ఆరుగురు, హర్యానాలో ఐదుగురు, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహం

బెంగళూరు: రైల్వే వంతెన సమీపంలో ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు చేస్తున్నారు. యువతిని ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని బ్యాగ్‌లో కుక్కి కదులుతున్న రైలు నుంచి బయటకు విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కర్నాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం హొసూర్ ప్రధాన రహదారిలోని పాత చందాపుర రైల్వే బ్రిడ్జి సమీపంలో, రైలు పట్టాల దగ్గర నీలం రంగులో ఉన్న ట్రావెల్ సూట్‌కేస్ పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. అందులో యువతి మృతదేహం ఉండటంతో షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రావెల్ బ్యాగ్‌లోని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. హతురాలి వయసు 18 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. ఆమెను ఎక్కడో హత్య చేసి సూట్‌కేసులో మృతదేహాన్ని కుక్కి కదులుతున్న రైలు నుంచి విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. దీంతో రైల్వే పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు పోలీస్ అధికారి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు పేర్కొన్నారు.

జవాబు దాటవేతకే విదేశాలకు అఖిలపక్షం: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: ప్రజల దృష్టి మరల్చడానికే అఖిలపక్ష ప్రతినిధి బృందాలను విదేశాలకు పంపుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. జవాబు చెప్పాల్సిన ప్రశ్నలను దాటవేసేందుకే అప్పటికప్పుడు ఈ ఆలోచన చేశారని వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ ఎంచుకున్న బలమైన విధానాన్ని ప్రపంచ దేశాలకు వివరించేందుకు వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు, మాజీ ఎంపీలతో కూడుకున్న ఏడు బృందాలను కేంద్రం విదేశాలకు పంపుతోంది. తమ అంతర్జాతీయ పర్యటనల్లో భాగంగా ఈ బృందాలు ఆయా దేశాల ప్రభుత్వాధినేతలతోపాటు పార్లమెంటేరియన్లు, మేధావులు, మీడియా సభ్యులను కలుస్తారు. 1950 నుంచి ఐరాసలో భారత వాణి వినిపించేందుకు ప్రతి ఏడాది అక్టోబరు-నవంబరు మధ్య అఖిలపక్ష నేతలతో కూడిన బృందాన్ని పంపేవాళ్లం. కానీ 2014 నుంచి ఆ సంప్రదాయాన్ని నిలిపివేశారు. అయితే ప్రస్తుతం మోదీ ప్రాభవం ప్రపంచవ్యాప్తంగా దెబ్బతినడంతో నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు. జవాబు చెప్పాల్సిన ప్రశ్నలను తప్పించుకోవడానికే అప్పటికప్పుడు ఈ అఖిలపక్షం ఆలోచన చేసి ఎంపీలను విదేశాలకు పంపిస్తున్నారు' అని జైరాం రమేశ్ ఆరోపించారు. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తున్న ప్రోత్సాహాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడానికి ఏర్పాటుచేసిన అఖిలపక్ష బృందాల్లోని పేర్లపై రాజకీయ రగడ రాజుకుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

టీమ్స్ ఆసుపత్రి నిర్మాణం వేగంగా పూర్తి చేయండి

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సనత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి నిర్మాణం పనులను వేగవంతం చేసేందుకు, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను త్వరితగతిన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం సీనియర్ అధికారులు టిమ్స్ నిర్మాణ స్థలాన్ని సందర్శించి, పురోగతిని సమీక్షించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టీనా చొంగ్తు, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ కార్యదర్శి హరిచందన దాసరి నేతృత్వంలో ఈ సందర్శన జరిగింది.

నిమ్స్, కిమ్స్, యశోద, ఏఐజీ హాస్పిటల్స్ నుండి సీనియర్ వైద్య నిపుణులు, నిర్వాహకులు క్లినికల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్‌కు సంబంధించి కీలక సూచనలు అందించారు. నిర్మాణ స్థలంలో సమగ్ర పరిశీలన అనంతరం, మిగిలిన పనులను వేగవంతం చేయడానికి, శాఖల మధ్య సమన్వయం పెంపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు.కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సైన్సెస్‌లో టిమ్స్ సనత్‌నగర్‌ను అత్యాధునిక టెర్షియరీ కేర్ సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఉన్నత వైద్య సేవలు అందించేందుకు నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డి, వైద్య విద్య శాఖ డైరెక్టర్ (డీఎంఈ), టిమ్స్ నోడల్ అధికారితో పాటు రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ, మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, సాంకేతిక బృందాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు ప్రాణాలర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడు, దేశంలో కంప్యూటర్ విప్లవాన్ని తీసుకువచ్చిన గొప్ప దార్శనికుడు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ దేశం పారిశ్రామిక విప్లవాన్ని అందుకోలేకపోయింది. కంప్యూటర్ విప్లవాన్ని వదులుకునేందుకు తాను సిద్ధంగా లేనని ఈ దేశాన్ని ఆధునిక యుగం వైపు అడుగులు వేయించారని కీర్తించారు. దేశ సమగ్రతకు విఘాతం కలిగించే ఎల్‌టీటీఈ వంటి ఉగ్రవాద సంస్థలను కట్టడి చేశారు. ఈ క్రమంలో దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయని ధీరోదాత్తుడు రాజీవ్ అని కొనియాడారు. క్లిష్ట సమయంలో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. వారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.

సేజ్ స్కూల్ ప్రాంగణంలో హైడ్రా కూల్చివేతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌లోని మేడిపల్లి ఆర్ఏఆర్ కాలనీలోని సేజ్ పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు బుధవారం కూల్చివేశారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి అనుసంధాన మార్గంలో ఈ అక్రమ నిర్మాణాలు ఉన్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు. పాఠశాల యాజమాన్యం కీలకమైన లింక్ రోడ్డులోని కొంత భాగాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిందని స్థానికులు కొన్నాళ్లుగా ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమణల వల్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కబ్జాపై కాలనీ వాసులు 15 ఏళ్లుగా పోరాడుతున్నారని తెలిసింది. అందిన ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ఈ తనిఖీల్లో నిర్ధారణ అయింది. దీంతో బుధవారం ఉదయం పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక బృందాలు పాఠశాల వద్దకు చేరుకుని, రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయి. ఈ కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

జనసేన శిక్షణ శిబిరం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్: యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, శారీరకంగా దృఢంగా ఉండడం కొరకు జనసేన శిక్షణ శిబిరాలు దోహదపడతాయని జనసేన రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ అన్నారు. జనసేన రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం మే 26 నుండి 31 వరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో నిర్వహించే పోస్టర్‌ను జనసేన రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, జనసేన రాష్ట్ర కో కన్వీనర్ మారూపాక అనిల్ కుమార్, ఏఐవైఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ శ్రీకాంత్, ఏఐవైఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ, సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు భాతరాజు రాజు నరసింహాతో కలిసి హిమాత్ నగర్, రాజ్ బౌద్ధూర్ గౌరు హాల్ ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం పంజాల రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలకు వ్యసనాలకు బానిస అవుతూ తమ విలువైన జీవితాలను అంధకారం లోకి నెట్టి వేసుకుంటున్నారని అని అన్నారు. సమాజంలో మెరుగైన పౌరులుగా తయారు కావడానికి జనసేన శిక్షణ శిబిరం ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతుల్లో వివిధ రకాలైన సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఇవ్వబడుతుంది. విపత్తుకరమైన పరిస్థితుల్లో ప్రజలకు కష్టాలు వచ్చినప్పుడు ఈ శిక్షణ పూర్తి చేసుకున్న యువతి యువకులు సేవా కార్యక్రమంలో నిమగ్నమై ఉంటారు. యువతి యువకులకు క్రమశిక్షణలో కెరియర్ డెవలప్మెంట్ తదితర అంశాలపైన అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బోయశ్రీరాములు, బోయ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుల కోసం రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితుల కోసం ఈ మెగా రక్తదాన శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌గౌడ్ ప్రారంభించగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ టీపీసీసీ అధ్యక్షులు వి.హనుమంత్‌రావు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, మత్స్యకారుల కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టిఎంఆర్ఈఐఎస్ ఖరేషీ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జీ సయ్యద్ ఖలీద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశాన్ని ఆధునిక టెక్నాలజీ వైపు నడిపించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ వ్యవస్థ టెలికాం విప్లవం కంప్యూటర్ రంగానికి ఆయన అందించిన ప్రోత్సాహం చాలా గొప్పవని అన్నారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులకు అభినందిస్తూ ప్రశంసపత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పలు జిల్లాల, నియోజకవర్గాల, మండలాల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీసీబీ డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రకటించింది. ఈ సంవత్సరం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనేది ప్రధాన అంశం. మన పర్యావరణం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంచడానికి పిసిబీ విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు బుధవారం నిర్వహించింది. ఈ సంవత్సరం కూడా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. (టీజిపిసిబీ) ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాల అనే మూడు గ్రూపుల కింద పాఠశాల పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించింది. 250 మందికి పైగా విద్యార్థులు తమ సృజనాత్మకతను ఉపయోగించి వివిధ చిత్రాలను చిత్రీకరించారు, భూమి, నీరు, గాలి, ప్లాస్టిక్ కాలుష్యం, శక్తి సంరక్షణ, నీటి సంరక్షణ, మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపు, కాలుష్యం నుండి భూమిని రక్షించే అనేక అంశాలపై చిత్రాలను గీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ హైదరాబాద్ సి.ధర్మేందర్, డ్రాయింగ్ మాస్టర్లు నరేందర్, రాములు, మల్లేశం పాల్గొన్నారు. పిసిబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. నాగేశ్వరరావు (టీ జి పి సి బీ) బాలభవన్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటిలో గెలుపొందిన వారికి జూన్ 5న సనత్ నగర్‌లోని పిసిబీ ప్రధాన కార్యాలయంలో ప్రతి విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ఆధునిక భారత స్వాప్నికుడు రాజీవ్ గాంధీ

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆధునిక భారత స్వాప్నికుడు రాజీవ్ గాంధీ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. శాంతి, స్వేచ్ఛ, సమానత్వం ద్వారా మానవాభివృద్ధిని సాధించవచ్చని ఐక్యరాజ్య సమితిలో రాజీవ్ గాంధీ ఇచ్చిన సందేశానికి ప్రపంచ దేశాధినేతల నుండి ప్రశంసలు వచ్చాయని గుర్తు చేశారు. బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పంజాగుట్టలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విగ్రహం వద్ద నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచాన్ని అరచేతిలో చుట్టేసేలా జీవితంలో కీలకంగా మారిన సెల్ ఫోన్ వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు రాజీవ్ గాంధీనే అని చెప్పుకొచ్చారు. దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా మార్చాలనే ఉన్నతమైన ఆశయంతో చట్ట సవరణ చేసి ఓటు వేసే కనీస వయసును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించారని గుర్తు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అత్యంత సన్నిహితుడు, ప్రేమాభిమానన్ని చూరగొన్న నాయకుడు మాజీ పీసీసీ హనుమంతరావు అంటూ కొనియాడారు. రాజీవ్‌గాంధీ నాటిన నాలాంటి మొక్కలు నేడు అగ్రనాయకులుగా కొనసాగుతున్నారని తెలిపారు. రాజీవ్ గాంధీని స్మరించుకునే విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా సచివాలయం ప్రాంగణంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు స్వయం ఉపాధి కల్పన కోసం రాజీవ్ గాంధీ పేరిట రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా యువతకు అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆనాడు చేపట్టిన కార్యాచరణ వల్లే నేడు దేశం సాంకేతిత రంగంలో విప్లవాత్మకమైన మార్పులు సాధించగలిగిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీ హన్మంత్‌రావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళ్లు అర్పించారు. అలాగే గాంధీ భవన్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నివాళ్లు అర్పించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు.

ప్రాణాలు తీసిన అతివేగం

కుంట్లూరు వద్ద డీసీఎంను ఢీకొన్న కారు

ముగ్గురు మృతి : మరొకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగర శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నగరశివారులోని హయత్‌నగర్ మండలంలో ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. బుదవారం ఉదయం పసుమాముల నుండి కుంట్లూరుకు వెళుతున్న ఎంహెచ్ 02 డిజి 0771 నెంబర్ గల కారు ఎదురుగా కుంట్లూరు నుండి పసుమాముల వైపుకు వస్తున్న డీసీఎం టిఎస్ 07 యుకె 2664 వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంకు సంబంధించిన వీడియో ఎదురుగా వున్న పెట్రోల్‌బంక్ సీసీ కెమరాల్లో రికార్డు అయ్యింది. యువకుల అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరు వద్ద వేగంగా దూసుకొచ్చిన కారు, డీసీఎం వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న పిన్నింటి చంద్రసేన్‌రెడ్డి (24) చుంచు త్రినాథ్‌రెడ్డి (24) చెంచు వర్షిత్ (23)లు అనే ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడడంతో ప్రమాద స్థలంలోనే మరణించారు. వీరితో పాటు ప్రయాణిస్తున్న మరో యువకుడు అలిమెట్టి కళ్యాణ్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా అతని సమీపంలోని ప్రైవేటు అసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరణించిన యువకుల మృతదేహాలను ఉస్మానియా అసుపత్రి మార్చరీకి తరలించడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి : కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : దోమల నియంత్రణ కార్యక్రమానికి ఎంటమాలజీ సిబ్బంది శ్రీకారం చుట్టింది. డివిజన్‌ల వారిగా ఒకే రోజు ఫాగింగ్ సిబ్బంది 12 చిన్న మిషన్లు, రెండు పెద్ద మిషన్లతో ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బుధవారం మౌలాలి డివిజన్‌లో కార్పొరేటర్ సునీత యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అసిస్టెంట్ ఎంటమాలజిస్టు వనజ మాట్లాడుతూ ఒక్కో డివిజన్‌లో ఫాగింగ్ సిబ్బంది మొత్తం అన్ని యంత్రాలతో ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కాకమందే దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారని ఆమె తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఈ విధమైన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఫాగింగ్ సూపర్‌వైసర్ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిని పెంపొందించడానికి కృషి చేసిన

గొప్ప అభ్యుదయవాది సుకుమారన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలో సాంస్కృతిక సహకారం ద్వారా శాంతిని పెంపొందించడానికి తీవ్రంగా కృషి చేసిన గొప్ప అభ్యుదయవాది టి.ఎస్. సుకుమారన్ అని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా కొనియాడారు. భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ కార్యదర్శిగా కొనసాగుతున్న టి.ఎస్. సుకుమారన్ విశాఖ పట్నంలోని తన స్వగృహంలో ఆకస్మికంగా మరణించడం పట్ల సయ్యిద్ అజీజ్ పాషా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, మఖ్దూమ్ భవన్ సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్), తెలంగాణ రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన టి.ఎస్. సుకుమారన్ సంతాప సభలో సయ్యిద్ అజీజ్ పాషా తోపాటు ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు రేఖల గోపాల్, ఐపిసో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, ఇస్కఫ్ రాష్ట్ర నాయకులూ ఎండి. మహబూబ్ తదితరులు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ టి.ఎస్. సుకుమారన్ మరణం పట్ల అయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేసారు. దోపిడీ, వివక్షకు గురైన ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం శాంతియుత ఉద్యమాలు చేసిన ప్రగతిశీలనేత టి.ఎస్. సుకుమారన్ అని తెలిపారు.

రేఖల గోపాల్ మాట్లాడుతూ స్నేహ, సాంస్కృతిక విలువల రక్షణ కోసం పాటుపడుతూ, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు మధ్య సంబంధాలను ప్రోత్సహించడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి టి.ఎస్. సుకుమారన్ అని అన్నారు. కెవిఎల్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతరేకంగా సమానత్వవాద సమాజం కోసం అనేక ఉద్యమాలలో టి.ఎస్. సుకుమారన్ క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేసారు. ప్రజల నుండి ప్రజలకు సాంస్కృతిక అవగాహన స్నేహాన్ని ప్రోత్సహించేందుకు అయన విశేష కృషి చేసారని కొనియాడారు.

జిహెచ్ఎంసికి శఠగోపం పెడుతున్న అధికారులు..!!

ఫిర్యాదులపై విచారణ చేపట్టని అధికార గణం

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఎంటమాలజీ విభాగం నిత్యం వార్తల్లోకి రావడం సర్వసాదారణంగా మారుతోంది. ఈ విభాగంపై అధికారులు, కాంట్రాక్టర్‌లు ప్రత్యేక దృష్టి సారించి అధికారులు ఈ విభాగాన్ని వదలకుండా తిష్ట వేసి ఉండడం, కాంట్రాక్టర్లు నఖిలీ పత్రాలను సృష్టించైనా కాంట్రాక్టు పనులు పొందడం జరుగుతూనే ఉంది. ఎంటమాలజీ విభాగంలో సిబ్బంది సరఫరా కోసం వేసే టెండర్లను దక్కించుకునే కాంట్రాక్ట్ పనుల కోసం కాంట్రాక్టర్‌లు దేనికైన సిద్దపడుతూ నఖిలీ పత్రాలను సృష్టించడంలో సిద్దహస్తులవుతున్నారు. ఇలాంటి వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన జోనల్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు కాంట్రాక్టర్లను అక్కున చేర్చుకుంటూ కాంట్రాక్టర్లు తానా అంటే సూపరింటెండెంట్ ఇంజనీర్లు తందాన అంటున్న పరిస్థితి నెలకొంటుందనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అక్రమాల మీద అక్రమాలు చోటు చేసుకుంటునే ఉన్నాయి. ఇటీవల సిబ్బంది సరఫరా కోసం టెండర్లను జోనల్ స్థాయిలో ఆహ్వానించారు. ఈ టెండర్ల ప్రక్రియలో అధికారులు అనుకున్న వారికే టెండర్లు దక్కే విధంగా జోనల్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు నిబంధనలు రూపొందిస్తూ నలుగురికి మాత్రమే అవకాశం కల్పించే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నలుగురిలో ప్రముఖ వ్యక్తి ఓ ఫర్మ్ పేరు మీద టెండర్లు వేస్తూ వర్క్ ఆర్డర్‌ల సమయంలో ప్రొప్రైటర్ (రిజిస్ట్రేషన్ లేని ఫర్మ్) పేరు తలపించే విధంగా రూపొందించి టెండర్లు పొందుతున్న పరిస్థితి ఉన్నప్పటికి దీనికి సంబంధించిన పత్రాలు పక్కాగా పరిశీలించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించి పాన్ కార్డులు, ఆధార్ వేరు వేరుగా ఉంటున్నప్పటికి అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడంలోని ఆంతర్యం అర్థం చేసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఏ టెండర్‌లోనైనా పోటీ ఎక్కువ ఉంటే ఆ సంస్థ పనులకు ప్రయోజనం జరిగే అవకాశం ఉంటుందని, అయితే ఇక్కడ మాత్రం ముగ్గురు, నలుగురు కాంట్రాక్టర్లే టెంటర్లలో పాల్గొనే విధంగా జోనల్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు లేని నిబంధనలు పెడుతూ కాంట్రాక్టర్ల నుండి వ్యక్తి గత ప్రయోజనం పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2000 సంవత్సరానికి ముందు ప్రతి కాంట్రాక్టర్ ఫీల్డ్‌పై తిరుగుతూ పర్యవేక్షించే నిబంధన ఉండేదని, ఆ నిబంధనలు తొలగించి విచిత్రమైన నిబంధనలు పెట్టడంతో పనుల్లో నాణ్యత లోపిస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గతంలో పని చేసిన చిన్న కాంట్రాక్టర్లు జిహెచ్ఎంసి సేవకు దూరమవుతున్న పరిస్థితి నెలకొంటుంది. ఖైరతాబాద్, సికింద్రాబాద్, ఎల్.బి.నగర్ తదితర జోన్‌ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు తీరుతో ఇటీవల జరిగిన టెంటర్లలో అవతకతవకలపై కొంత మంది కాంట్రాక్టర్లు కమిషనర్, ఇంచార్జీ ఛీఫ్ ఎంటమాలజీస్టుకు, ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్‌లకు పూర్తి వివరాలను తెలిపినా వీటిపై విచారణ జాప్యం జరగడం, నేటికి ఈ అక్రమాలపై చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోవడంలో మతలబు ఏంటని అనుమానం వ్యక్తం అవుతోంది. ఆ ఫిర్యాదును విచారించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కాంట్రాక్టర్‌లకు మార్గదర్శకుడైన అధికారికే ఫిర్యాదు పత్రాలను అందజేసి విచారణ చేయమని చెప్పితే ఏం ప్రయోజనం చేకూరుతుందని పలువురు పెదవి విరుస్తున్నారు. అక్రమార్కులకే పట్టం కట్టిన సామెతను తలపించే విధంగా అధికారుల తీరు ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అక్రమార్కులకు అండదండలు అందిస్తూ జిహెచ్ఎంసికి శఠగోపం పెడుతూ వ్యక్తిగత ప్రయోజనానికి పాల్పడ్డమే అధికారులు లక్ష్యంగా భావిస్తున్నారనే అభిప్రాయం పలువురు కాంట్రాక్టర్ల నుండి వ్యక్తం అవుతోంది. 2021లో ఈ తంతు జరిగినా పట్టించుకునే పరిస్థితి కరువైందని, అధికారులు సంస్థకు చేసే ప్రయోజనం వారికి చేకూరే ప్రయోజనాన్నే చూసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. తప్పుడు పత్రాలతో టెండర్లు దక్కించుకున్నది, ఏ పేర్లతో వర్క్ ఆర్డర్లు తీసుకున్న విషయాన్ని అధికారుల విన్నవించినా అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం విస్మయం కల్గిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లుఫ్తాన్సా విమానానికి తప్పిన ముప్పు

విమానంలో 160 మంది ప్రయాణికులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ విమానానికి పెను ప్రమాదం తప్పింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపం తలెత్తడంతో విమానాన్ని అత్యవసరంగా తిరిగి విమానాశ్రయంలోనే ల్యాండింగ్ చేశారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే, జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం 160 మంది ప్రయాణికులతో శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్రాంక్‌ఫర్ట్‌కు బుధవారం తెల్లవారుజామున బయలుదేరింది. విమానం గాల్లోకి లేచిన కొద్దిసేపటికే దాని ల్యాండిరగ్ గేర్‌లో సాంకేతిక సమస్య ఉన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. అనంతరం, విమానాన్ని వెనక్కి మళ్లించి శంషాబాద్ విమానాశ్రయంలోనే అత్యవసరంగా, సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానం సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో ప్రయాణికులు, సిబ్బంది, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నాగం పిటీషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

పాలమూరు ఎత్తిపోతలపై ఆరోపణలకు ముగింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అక్రమాలున్నాయంటూ, సీబీఐ దర్యాప్తు చేయాలని మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకునే అవసరం లేదని స్పష్టంగా పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం విచారించింది. దాదాపు ఐదేళ్లుగా విచారణ కొనసాగుతున్న ఈ పిటిషన్‌కు నేడు తెర పడిరది.మేఘా ఇంజినీరింగ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపించారు. ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో దీనికి సంబంధించి ఐదు పిటిషన్లు కొట్టివేయబడ్డాయి. ఇందులో ఎలాంటి మోసం లేదని, అవకతవకలు లేవని సివిసీ నివేదికలో కూడా తేల్చిందని తెలిపారు. ఎస్టిమేట్లు పెరిగిన విషయాన్ని తప్పుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా బీహెచ్ఈఎల్ వంటి కీలక భాగస్వామి సంస్థ కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఒకటి రెండు డాక్యుమెంట్లను ఆధారంగా చేసుకొని ఈ కేసులు వేయడం దురుద్దేశపూరితమని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ సజావుగా కొనసాగుతోందని, అభివృద్ధికి ఇది కీలకమైందని అన్నారు. నాగం తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించినా, కోర్టు వాటిని సమర్థించకపోవడంతో పిటిషన్‌ను తిరస్కరించింది. కృష్ణా జలాలను ఎత్తిపోసి, నీటి కొరతతో ఇబ్బందిపడుతున్న పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు నీటి అవసరాలను తీర్చే ఉద్దేశంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు, ప్రపంచంలోనే అత్యంత భారీ పంపులతో నిర్మితమైన అత్యాధునిక ఎత్తిపోతల వ్యవస్థగా నిలవనుంది.

పాలన చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 17 నెలలుగా పాలన చేసేందుకు చేతకాక కేవలం డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం గడుపుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎంతసేపు సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ పార్టీ అనేక నాటకాలు ఆడుతుందని అయన దుయ్యబట్టారు. బుధవారం నల్గొండలో పర్యటించిన అయన మీడియాతో మాట్లాడుతూ కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదని, పాలన అసలే కనిపించడం లేదని ఆరోపించారు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే "కమిషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు" అని స్వయంగా బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఈ రాష్ట్రంలో కమిషన్‌ల పాలన నడుస్తోంది తప్ప ప్రజల పాలన కాదని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోతే అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా ప్రభుత్వానికి లేకపోయిందన్నారు. మీ కమిషన్‌ల అరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారని మండిపడ్డారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్ప లేని దద్దమ్మ ప్రభుత్వం ఇదంటూ వ్యాఖ్యానించారు. నల్గొండలో సుంకిషాల ప్రాజెక్ట్ కూలిందని అయినా ఇంతవరకు ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయని నిలదీశారు. మీరు ఎంత నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయన్నారు. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే అని త్వరలోనే ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారని అన్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే రావడంతో పాటు ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయన్నారు.

బిఎఫ్ఏ ప్రవేశ కోర్సుకు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించే బిఎఫ్ఏ శిల్పం, చిత్ర లేఖనం కోర్సుల్లో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె. హనుమంతరావు తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం లోని శిల్పం చిత్రలేఖనం శాఖ ద్వారా నిర్వహించే ఈ శిక్షణా తరగతులను ఈ నెల 26 నుండి జూన్ 14 వరకు మూడు వారాల పాటు నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని శిల్పం, చిత్రలేఖనం మరియు ప్రింట్ మేకింగ్ అధ్యాపకుల ద్వారా కోర్సుకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని ఈ తరగతుల ద్వారా నేర్చుకునే అవకాశం ఉందని, ఆసక్తి గల విద్యార్థులు 8309011865, 8309498807 చరవాణి ద్వారా సంప్రదించాలని వారు తెలిపారు.

సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక అభివృద్ధి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ తమ సేవా ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని సాధించింది. 60 ఏళ్ల నిరంతర సమాజ సేవను పురస్కరించుకొని డైమండ్ జూబ్లీ ఉత్సవాలను భారీగా జరుపుకుంది. ఈ వేడుకలు సికింద్రాబాద్, బొలంరాయి లోని డ్రీమ్ లాండ్ గార్డెన్స్‌లో అద్భుతంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకకు ప్రధాన అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ లయన్. మనోజ్ షా, హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ మానవతా వాదానికి అంకితభావాన్ని, సామాజిక అభివృద్ధిలో చేసిన కృషిని ప్రశంసించారు. సేవ కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించాలని కోరారు. విద్య, వైద్య రంగాలలో లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలని సూచించారు. ప్రధానంగా ఆనాథలు, అభాగ్యులను ఆదరించి ఆశ్రయం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నైపుణ్య శిక్షణ శిబిరాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా, బాలికల విద్యా ప్రోత్సాహార్థంగా 60 మంది మెరిటోరియస్, ఆర్థికంగా బలహీనమైన బాలికలకు సైకిళ్లను దానం చేయడం గర్వంగా ఉందని మనోజ్ షా అన్నారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్. బాబురావు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్. ఆర్. సునీల్ కుమార్, మల్టిపుల్ 320, డిస్ట్రిక్ట్ 320ఎ కి చెందిన ప్రముఖ నాయకులు లయన్. నరేందర్ రెడ్డి లయన్. దీపక్ భటాచర్జీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్. డి.కోటేశ్వరరావు, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్. హెచ్. రాజి రెడ్డి, పూర్వ అధ్యక్షులు చంద్ర శేఖర్ వేముల, హరి దర్శన్ సాలికే అతిథులుగా హాజరై, క్లబ్ గతంలో చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ విశిష్ట సందర్భాన్ని పురస్కరించు కొని, క్లబ్ తమ సేవా పరిధిని విస్తరించేందుకు ఒక చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించింది. క్లబ్ ప్రెసిడెంట్ లయన్. నవీన్ మాజేటి, సెక్రటరీ లయన్ సునీల్ తాటిపల్లి, ట్రెజరర్ లయన్ సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో, డైమండ్ జూబిలీ సెలబ్రేషన్స్ కమిటీ చైర్మన్‌గా ఆర్. సునీల్ కుమార్ సారథ్యంలో అద్భుతంగా నిర్వహించారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుని వారి నివాస కార్యాలయలో బుధవారం మర్యాద పూర్వకంగా కలసి వెంకట శివరామల యంలో నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కాగలరని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు బద్రి, బి.సి అధ్యక్షులు చందు, అన్వేష్ పాల్గొన్నారు.

చిన్న పెద్దమ్మ దేవాలయంలో గాంధీ పూజలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్‌లో గల చిన్న పెద్దమ్మ దేవాలయంలో జరిగిన పూజ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేసినారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య యాదవ్, సాంబశివరావు, రాంచందర్, బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, అనిల్, సంతోష్, గంగాధర్, రవి, శ్రీనివాస్ గుప్తా, మహేందర్, తైలి కృష్ణ, రంగస్వామి, మల్లేష్,యాదమ్మ పాల్గొన్నారు.

కెసిఆర్, హరీష్‌రావులకు నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డ నగేష్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ముషీరాబాద్, రాంనగర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుల నాగేష్ ముదిరాజ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అసమర్థ పాలన కప్పి పుచ్చుకోవడానికి కెసిఆర్, హరీష్ రావుకు నోటీసులు ఇస్తున్నారని, ఆ తాటాకు చప్పులకు భయపడేది లేదన్నారు. అలా భయపడితే అప్పటి ఆంధ్ర పాలకులతో, ఢిల్లీ పాలకులతో కోట్లాది తెలంగాణ రాష్ట్ర ని కెసిఆర్, హరీష్‌రావులు సాధించే వారా అని ముదిరాజ్ ప్రశ్నించారు. సూట్ కేసులు ఢిల్లీకి మోయడం తప్ప ప్రజా పాలన గాడి తప్పిందని, ప్రజలు వ్యతిరేకత చూపిస్తున్నారన్నారు.

బాంబు డిస్పోజల్ టీం తో పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర - మేడిపల్లి: ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని మేడిపల్లి సిఐ ఆధ్వర్యంలో బుధవారం బాంబు డిస్పోజల్ టీం డాగ్‌తో పోలీస్ సిబ్బంది ప్రజలు రద్దీగా ఉండే హెటల్స్, షాపింగ్ మాల్స్, ఉప్పల్ డిపో పరిసర ప్రాంతాల ను తనిఖీ చేశారు. సీఐ గోవింద రెడ్డి ప్రజలకు సూచనలు చేస్తూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే, అనుమానాస్పద వస్తువులు ఉన్నట్లయితే పోలీసు వారిని డయల్ 100ను సంప్రదించాలని తెలిపారు.

అంబటి కృష్ణమూర్తిపై దాడి గర్హనీయం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణ మూర్తిపై దాడి గర్హనీయం అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిసి, ఎస్.సి. ఎస్.టి, మైనారిటీ ప్రజాసంఘాల నేతలు జేబి రాజు, సత్యం, పోకల కిరణ్, నాగుల శ్రీనివాస్ యాదవ్, జేమ్స్, భూదాల అమర్‌బాబు, గొల్లపల్లి దయానంద, నాగరాజు, కృష్ణ గౌడ్, జనార్ధన్, బండారు శైలజ, పి అరుణ, జ్యోతి, సత్యదేవ్ తదితరులు తెలిపారు. హైదరాబాద్, బషీర్ బాగ్, ఐ.ఎన్.టి.యు.సి (ఆర్) హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులుగా చెప్పుకుంటున్న జి. సంజీవ రెడ్డి అనుచర గుండాలు ఆర్.డి. చంద్రశేఖర్ ఇంకా కొంతమంది అంబటి కృష్ణ మూర్తి ఆయన కార్యవర్గ సభ్యులపై దౌర్జన్యంగా కేకలు వేస్తూ భౌతిక దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. గత 15 సంవత్సరాలుగా కార్మిక వర్గంలో ముఖ్యంగా అసంఘటిత రంగంలో అంబటి కృష్ణ మూర్తి పనిచేస్తూ రోజు రోజుకు ఆదరణ పెరగడం చూసి ఈర్షతో కుట్రతో దాడి చేసిన విధానాన్ని కార్మిక సంఘాలు ప్రజా సంఘాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ మిగతా వివిధ కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఒక బీసీ నాయకుడు జాతీయస్థాయిలో నాయకుడిగా ఎదగటానికి సహించలేని అగ్రవర్ణాల తొత్తులైన జి.సంజీవరెడ్డి రౌడీ మూకలు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. అంబటి కృష్ణ మూర్తిపై దాడి మొత్తం అణగారిన వర్గాల మీద జరిగిన దాడిగా వర్ణించారు. దోషులను చట్టపరమైన శిక్షను విధించ వలసిందిగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో మిర్జాలగూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ చిన్న వయసులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్ యాదవ్, చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ మహిళా నాయకురాళ్ళు, కాంగ్రెస్ పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మొయినాబాద్: స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విప్లవానికి నాంది పలికిన మహనీయుడని, అనేక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించిన మేధావి, రాజకీయ వేత్త రాజీవ్‌గాంధీ అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మాణయ్య, నవాబ్ పెట్ మండల అధ్యక్షులు వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటరెడ్డి, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, చేవెళ్ల నియోజకవర్గం అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా ప్రెసిడెంట్స్, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ అధ్యక్షులు, మైనారిటీ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు డైరెక్టర్లు, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు జడ్పిటిసిలు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్‌లో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, బీసీ, ఎస్సీ, ఎస్టి సెల్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రా : స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా నాచారం డివిజన్ పరిధిలోని రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు, ఐఎన్‌టియుసి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వి.ఎస్ ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నాచారం చౌరస్తాలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి మందమాల పరమేశ్వర్ రెడ్డి హాజరై పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం గరీబి హటావ్ అనే నినాదంతో పేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జి.క్రిష్ణా రెడ్డి, రఘుపతి రెడ్డి, రామ్ రెడ్డి, ఎం.శ్రీనివాస్ రెడ్డి, టోపిక్ కన్న, చిలుకనగర్ మాజీ అధ్యక్షులు బాలరాజు, రామక్రిష్ణ, అజీమ్, సుధాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు నరేష్, ఫిరోజ్, ఈసుప్, ప్రవీణ్, ఈజామ్, మహిళా అధ్యక్షురాలు ఉమ, షినాజ్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, నిజాం, క్రుపాకర్, కాపి రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దుండిగల్: పేదల పెన్నిధి దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బుధవారం మాజీ ప్రధాని స్వర్గీయ కి.శే రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి వారి చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీ అని, అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత అయనదేనని గుర్తుచేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్,ఎస్ ఎమ్ సి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం దివంగత మాజీ ప్రధాని ఆధునిక భారత నిర్మాత, యువ రాజకీయానికి నవ మార్గదర్శి స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు స్మరించుకున్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని గంగారాం హుడా కేఫ్ నందు ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహాన్నికి ఎంబిసి డెవలప్మెంట్ చైర్మన్ జేరిపేటి జైపాల్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ కలిసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఓటు వేసే వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించడం, పంచాయతీ రాజ్‌ను బలోపేతం చేయడం, టెలికాం ఐటీ విప్లవం, సమ్మిళిత విద్యపై ప్రాధాన్యతతో కొత్త విద్యా విధానం వంటి ఆయన అనేక ముఖ్యమైన కార్యక్రమాలు దేశంలో పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్డినేటర్ రఘునందన్ రెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు బలింగ్ యాదగిరి గౌడ్, వీరేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ అలీ, బాష్పక యాదగిరి, మారేలా శ్రీనివాస్, జహంగీర్, నగేష్ నాయక్, మహిళల అధ్యక్షులు, నాయకులు కట్ల శేఖర్ రెడ్డి, ఉరిటీ వెంకట్‌రావు, ఆయాజ్ ఖాన్, శేఖర్ ముదిరాజ్, నరేందర్ గౌడ్, సౌందర్యరాజన్ పాల్గొన్నారు.

గతంలో భూములు పంచిన ఘనత సిపిఐదే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సిపిఐ అల్వాల్ మండల 4వ మండల మహాసభలు యాప్రాల్‌లో మల్లన్న గుడి ఆవరణలోని కమిటీ హాల్‌లో బుధవారం అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్ అధ్యక్షతనలో వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్ హాజరై మాట్లాడుతూ సాయుధ పోరాటం నుండి భూములు పంచిన ఘనత సిపిఐ పార్టీదేనని అన్నారు. ఇల్లు లేని నిరు పేదలకు ఎన్నో ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదల పక్షాన పోరాటం చేసినటు వంటి ఘనత సిపిఐ పార్టీ చరిత్ర అని ఆయన తెలిపారు. అల్వాల్ మండలంలో భగత్ సింగ్ నగర్, భూపేష్ నగర్, నారాయణరెడ్డి నగర్, నిర్మలా నగర్, కౌకూర్, భరత్ నగర్‌లో వేలాది మందితో గుడిసెలేసి ఇండ్ల పట్టాలు సాధించింది సిపిఐ అని ఆయన తెలిపారు. పెంచిన ధరలు తగ్గించాలని పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మహాసభలు ఈసీఐఎల్ బంజారా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆగస్టులో 19, 20, 21, తేదీలలో కుత్బుల్లాపూర్ మండలంలో ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ మహాసభలలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, ఉమా మహేష్, సిహెచ్. ధశరథ్, టి.శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కే.రవి చందర్, బి.నరేంద్ర చారి, రైతు సంఘం నాయకులు జంగయ్య, ఎన్.నర్సింలు, సిపిఐ అల్వాల్ మండల సహాయ కార్యదర్శిలు పి.చంద్రయ్య, సల్మాన్ బేగ్, యాప్రాల్ శాఖ కార్యదర్శి వై.వెంకటేష తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్వాల్ మండల నూతన కమిటీ ఎన్నిక 21 మంది కౌన్సిల్, కార్యవర్గం 9 మందితో ఎన్నుకోవడం జరిగింది.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

విశాలాంధ్ర - మొయినాబాద్ : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటి దని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జీ పామెన భీం భరత్ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 42 మంది లబ్ధిదారులకు మంజూరైనా రూ. 20 లక్షల 59 వేలను చెక్కులను చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవ ర్గ ఇంచార్జీ పామెన భీం భరత్ లబ్ధిదారులకు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించడం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మాణయ్య, నవాబ్ పెట్ మండల అధ్యక్షులు వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట రెడ్డి, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, చేవెళ్ల నియోజకవర్గం అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా ప్రెసిడెంట్స్, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్ళు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ఎన్ఎస్ యూఐ, అనుబంధ అధ్యక్షులు, మైనారిటీ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు డైరెక్టర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆమనగల్లు : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఆమనగల్లు, కడ్తాల్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఐటీ రంగానికి ఆజ్యుడు రాజీవ్ గాంధీ ఆజ్యం పోసి యువతకు స్ఫూర్తి ఐటీ రంగానికి ప్రధాతగా రాజీవ్ గాంధీ నిలిచారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆమనగల్లులోని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. మార్కెట్ చైర్మన్ యాటగీత నర్సింహా, మండల అధ్యక్షులు జగన్, పట్టణ అధ్యక్షులు మానయ్య, సీనియర్ నాయకులు కేశవులు, శ్రీనివాస్, ఖాదర్, కరీం, మల్లయ్య, కృష్ణ నాయక్, అలీమ్, శ్రీశైలం, హరిలాల్, ఫరిద్, శాబుద్దీన్, నాజర్, మహేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సంవత్సరం ప్రోత్సాహకరంగా ముగించిన ఐస్ మేక్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : దాదాపు 50 కంటే ఎక్కువ వాణిజ్య పారిశ్రామిక శీతలీకరణ పరికరాల తయారీలో అగ్రగామిగా ఉన్న ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్, మార్చి 31తో ముగిసిన నాల్గవ త్రైమాసికం మరియు పూర్తి సంవత్సరానికి బలమైన ఆర్థిక ఫలితాలను నివేదించింది. మార్చి 31, 2025తో ముగిసిన త్రైమాసికానికి, కంపెనీ తమ కార్యకలాపాల నుండి రూ. 180.82 కోట్ల ఏకీకృత ఆదాయాన్ని నివేదించింది, ఇది క్యూ4 ఎఫ్‌వై24లో రూ.140.14 కోట్ల నుండి సంవత్సరానికి 26.76% బలమైన పెరుగుదలను సూచిస్తుంది. ఇది గత త్రైమాసికంతో పోలిస్తే ఈ త్రైమాసికంలో 29.02% వృద్ధి నమోదు చేసింది. ఈ త్రైమాసికంలోఈబీట రూ. 21.85 కోట్లుగా ఉంది, గత సంవత్సరం ఇదే కాలంలో అది రూ. 20.93 కోట్లు. అయితే, అధిక ఇన్‌పుట్ ఖర్చుల కారణంగా ఈబీట మార్జిన్ 14.93% నుండి 12.08%కి తగ్గింది. ఈ త్రైమాసికంలో పన్ను తర్వాత లాభం రూ.11.66 కోట్లుగా నిలిచింది. ఎఫ్‌వై25లో మేము బలమైన ఆదాయ వృద్ధిని సాధించి దాదాపు రూ.480 కోట్లకు చేరుకున్నప్పటికీ, ఎఫ్‌వై25 మొదటి 9 నెలల్లో కొన్ని ఉత్పత్తి ఆర్డర్ నిర్వహణలో ఆలస్యం కారణంగా మేము మా అంతర్గత మైలురాయి రూ. 500 కోట్లను చేరుకోలేకపోయాము. తుది డివిడెండ్, దీర్ఘకాలిక వాటాదారుల విలువ స్థిరమైన వృద్ధికి మా అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ పటేల్ అన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ని కలిసి, డివిజన్‌లో జరగవలసిన అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. గౌతమ్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతోపాటు రోడ్లు, బాక్స్ డ్రైనేజీలు, పారిశుధ్య పనుల కోసం అవసరమైన నిధులు కేటాయించాల్సిన అవసరాన్ని వివరించి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై కూడా చర్చించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్ పాల్గొన్నారు.

బాబూ... బనకచర్ల ఎవరికోసం?

- పాత ప్రాజెక్టులు పూర్తి చేయకుండా మరో భారీ ప్రాజెక్టా?
- ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి
- గోదావరి-పెన్నా ఏకం చేయడం అవశ్యం
- నదుల అనుసంధానంపై మేధోమథన సదస్సులో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం-బనకచర్ల పథకం ఎవరి కోసమని, పాత ప్రాజెక్టులు పూర్తి చేయకుండా మరో భారీ ప్రాజెక్టు అవసరమా అని వక్తలు ప్రశ్నించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు మానుకుని పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ ప్రముఖ నేత, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కొల్లి నాగేశ్వరరావు 5వ వర్ధంతి సందర్భంగా 'నదుల అనుసంధానం ఆవశ్యకత-ప్రతిపాదనలు-సానుకూల, ప్రతికూలాంశాలు' అనే అంశంపై బుధవారం విజయవాడలో కొల్లి నాగేశ్వరరావు అధ్యయన కేంద్రం, సమన్వయకర్త టి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన సభ జరిగింది. విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఇందుకూరి సత్యనారాయణ రాజు (ఐఎస్ఎన్ రాజు), విశ్రాంత ఇ.ఇ. కంభంపాటి పాపారావు, మాజీ ఎంపీ, రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రైతు సేవా సంస్థ అధ్యక్షులు అక్కినేని భవానీ ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు తదితరులు ప్రసంగించారు. పోలవరం-బనకచర్ల పథకంపై చర్చించి, గోదావరి నది వరద జలాలను సద్వినియోగం చేసుకోవడానికి, బచావత్ ట్రిబ్యునల్ ద్వారా సంక్రమించిన కృష్ణా నది జలాల హక్కులను పరిరక్షించుకోవడానికి, నిత్య కరవు పీడిత రాయలసీమ ప్రాంతానికి కృష్ణా నదీ జలాల తరలింపు ద్వారా శాశ్వత పరిష్కారం చేయడానికి వీలుగా సహేతుకమైన నిర్ణయాన్ని, విజ్ఞతతో తీసుకోవడానికి రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, జల వనరులు, నీటి పారుదల ప్రాజెక్టుల సమస్యలపై అధ్యయనం, ఉద్యమాలు చేస్తున్న సామాజిక ఉద్యమకారులతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సత్వరం సమావేశం నిర్వహించాలని వక్తలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రెండు తెలుగు రాష్ట్రాల నీటి సమస్యపై ఒకవైపు విచారణ, ఇదే ట్రిబ్యునల్ మహారాష్ట్ర, కర్నాటక, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తూ 2013లో ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో పోలవరం-బనకచర్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిపాదించడం ఆంధ్ర ప్రదేశ్‌కు తీవ్ర ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నదని విమర్శించారు. పోలవరం-బనకచర్ల పథకాన్ని ఉపసంహరించుకుని, గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధాన పథకాన్ని పోలవరం-సోమశిల అనుసంధాన పథకంగా నిర్మించాలన్నారు. గోదావరి జలాలను పోలవరం కుడి కాలువ ద్వారా కాకుండా ప్రత్యేక వరద కాలువ ద్వారా గరిష్ఠ స్థాయిలో తరలించి, కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆయకట్టు, వెలిగొండ, సోమశిల ఆయకట్టుకు గరిష్ఠంగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ఆదా అయ్యే కృష్ణా జలాలను శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా గ్రావిటీ మీద బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేర్చి తెలుగు గంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులకు అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై ముఖ్యమంత్రి విస్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపాదించిన ఎత్తిపోతల పథకాన్ని తక్షణం రద్దు చేయాలని, రాష్ట్రంలో, ప్రత్యేకించి రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి నిదులను మంజూరు చేసి యుద్ధప్రాతిపదికపై పూర్తి చేయాలని, వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు రానున్న వర్షా కాలం దృష్ట్యా వెంటనే మరమ్మతులు చేయాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎవరు అడిగారని బనకచర్ల నెత్తికెత్తుకున్నారు: రామకృష్ణ

ఎవరు అడిగారని రూ.82 వేల కోట్ల అంచనా వ్యయంతో పోలవరం-బనకచర్ల ఎత్తిపోతల పథకం ప్రతిపాదన చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తారని విమర్శించారు. నాడు అమరావతి రాజధానికి తాము మద్దతు ఇచ్చామని, కానీ మొత్తం అభివృద్ధి అంతా ఇక్కడే చేస్తుండటంతో ఇతర ప్రాంతాల వారికి అసూయ, ద్వేషం కలుగుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా స్వలాభం కోసం బనకచర్లను నెత్తిన ఎత్తుకున్నారని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గితే కేవలం బ్యారేజీగా మిగిలిపోతుందని, రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని నాడు చంద్రబాబు అన్న విషయాన్ని గుర్తు చేశారు. అదానీ విద్యుత్ అగ్రిమెంట్ల విషయంలోనూ చంద్రబాబు నేడు మాట్లాడటం లేదని మండిపడ్డారు. గండికోట ప్రాజెక్టులో 25 టీఎంసీల నీరు సంవత్సరాల తరబడి అంతే ఉన్నాయన్నారు. హంద్రి-నీవా క్రింద ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదన్నారు. ఇవేమీ చేయకుండా రూ.82 వేల కోట్లు ఖర్చు పెడతామంటే ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రాధాన్యతలు సరిగాలేవని విమర్శించారు. అన్ని ప్రాంతాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్టర్ లబ్ధి కోసమే ఈ ప్రాజెక్టు చేపడుతున్నట్లుగా ఉందని విమర్శించారు. ప్రాజెక్టులపై కాంట్రాక్టర్‌లకు పెత్తనం ఇవ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీనిపై ప్రతి ఒక్కరూ గళం విప్పాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

'నంబాల' ప్రస్థానం ఇలా...

- వరంగల్ ఆర్ఈసీలో విప్లవ భావజాలం వైపు ఆకర్షణ
- ఎంటెక్ నుంచి ఉద్యమబాట
- 2018లో మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్‌గా బాధ్యతలు
- 1983 నుంచి అజ్ఞాతంలోనే

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం జియన్నపేట. ఆయన 1995లో జన్మించినట్లు సమాచారం. ఆయన తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. కేశవరావుకు ఒక సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. ప్రాథమిక విద్యను తన సొంత ఊరిలోనే పూర్తి చేసిన కేశవరావు, ఉన్నత పాఠశాల విద్యను టెక్కలి మండలం తలగాంలోని తన తాతగారి గ్రామంలో అభ్యసించారు. అనంతరం టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ, డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న తరుణంలో వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ప్రస్తుత నిట్)లో ఆయనకు ప్రవేశం లభించింది. బీటెక్ పూర్తిచేసిన తర్వాత కేశవరావు ఎం.టెక్ కూడా పూర్తిచేశారు. ఉన్నత విద్యావంతుడైన ఆయన, 1983లో పూర్తిస్థాయిలో అజ్ఞాతంలోకి వెళ్లిపోయి నక్సల్‌బరి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి ఆయన తిరిగి స్వగ్రామానికి రాలేదని గ్రామస్థులు చెబుతుంటారు. సుదీర్ఘకాలం మావోయిస్టు ఉద్యమంలో పనిచేసిన ఆయన, గణపతి తర్వాత పార్టీలో అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే పీపుల్స్ వార్ గ్రూపు సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితులయ్యారు. 1980లో శ్రీకాకుళంలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ), ఏబీవీపీ విద్యార్థి సంఘాల మధ్య జరిగిన ఘర్షణల నేపథ్యంలో కేశవరావును పోలీసులు అరెస్ట్ చేశారు. మావోయిస్టు పార్టీలో చేరిన తర్వాత ఆయన తన పేరును బసవరాజుగా మార్చుకున్నారు. 1987లో బస్తర్ అడవుల్లో ఎల్‌టీటీఈ మాజీ సైనికుల వద్ద గెరిల్లా యుద్ధ తంత్రాలు, ఆయుధ వినియోగంలో ప్రత్యేక శిక్షణ పొందారు. ముఖ్యంగా ఐఈడీ పేలుడు పదార్థాల వినియోగంలో ఆయనది అందెవేసిన చేయి అని చెబుతారు. పీపుల్స్ వార్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా ఉన్న కేశవరావు, కాలక్రమేణా మావోయిస్టు పార్టీలో కీలక స్థాయికి ఎదిగారు. మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్‌కు అధిపతిగా కూడా ఆయన పనిచేశారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2018లో అప్పటి మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి గణపతి (ముప్పాళ్ల లక్ష్మణరావు) రాజీనామా చేయడంతో ఆ బాధ్యతలను బసవరాజు స్వీకరించారు. దేశవ్యాప్తంగా జరిగిన అనేక విధ్వంసక ఘటనలకు బసవరాజు సూత్రధారి అని భద్రతా దళాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా, 2010లో ఛత్తీస్‌గఢ్ దంతెవాడలో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల మృతికి కారణమైన భీకర దాడి, అలాగే 2019లో మహారాష్ట్రలోని గడ్చిరౌలిలో 15 మంది పోలీసుల మృతికి కారణమైన పేలుళ్ల ఘటన, అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్ మైన్స్ దాడి, 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వెనుక బసవరాజు కీలక పాత్ర పోషించారని అధికారులు చెబుతున్నారు. మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. గణపతితో పోల్చితే పార్టీ సిద్ధాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు... ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు.

సెప్టెంబర్ 30 నాటికి సారా రహితంగా రాష్ట్రం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాన్ని సారా నుండి పూర్తిగా విముక్తం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (ఎక్సైజ్, జీఏడీ-రాజకీయం) ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయన రాష్ట్రంలోని అందరు ఎక్సైజ్ అధికారులకు కీలక సూచనలు చేశారు. సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రం మొత్తాన్ని నాటు సారా రహితంగా మార్చాలని తుది గడువు విధించారు. అధికారులు తక్షణ చర్యలకు దిగాలని ఆదేశించారు. కాకినాడ, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గత అనుభవాల ఆధారంగా ప్రత్యేక వ్యూహాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. అలాగే, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ప్రవాహాన్ని నిరోధించేందుకు గతంలో తీసుకున్న చర్యలు ఫలప్రదంగా ఉన్నా, మరింత నిఘా అవసరమని అభిప్రాయపడ్డారు. రూ.99 మద్యం బ్రాండ్లు ప్రవేశపెట్టడం వల్ల కట్టడి పక్కాగా జరిగిందని పేర్కొన్నారు. ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అధికారులు ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని, సమస్యలపై వెంటనే స్పందించేలా వ్యవస్థను సజావుగా నడిపించాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఐడీ లిక్కర్ కేసులు, ఎన్డీపీఎల్ కేసులు , పెండింగ్ అరెస్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముకేశ్‌కుమార్ మీనా రాష్ట్ర ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రూపొందించిన డైరీ-కమ్-హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు.

ఏపీకి కుంకీ ఏనుగులు అప్పగించిన కర్నాటక

స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కర్నాటక ప్రభుత్వం నాలుగు కుంకీ ఏనుగులను అందజేసింది. మొత్తం ఆరు కుంకీ ఏనుగులు ఇవ్వవలసి ఉండగా, రెండు ఏనుగులను వాటి ఆరోగ్య కారణాలు, శిక్షణ పూర్తి కాకపోవడం వంటి కారణాల వల్ల మరో దఫా అందజేయనున్నట్లు కర్నాటక ప్రభుత్వం తెలియచేసింది. బుధవారం బెంగళూరులోని కర్నాటక విధాన సౌధ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేలు కుంకీ ఏనుగులను ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. కుంకీ ఏనుగుల అప్పగింతకు సంబంధించిన ఒప్పంద పత్రాలను, లైసెన్స్‌లు, వాటి సంరక్షణకు సంబంధించిన విధివిధానాల పత్రాలను కర్నాటక సీఎం ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు అందజేశారు. గజ పూజ నిర్వహించిన అనంతరం జెండా ఊపుతూ కర్నాటక ప్రభుత్వాధినేతలు కుంకీలను సాగనంపగా, పూల వర్షం కురిపిస్తూ పవన్ కల్యాణ్ వాటికి ఆహ్వానం పలికారు. ఈ నాలుగు ఏనుగులను కర్నాటక అటవీ శాఖ అధికారుల నుంచి ఆంధ్ర ప్రదేశ్ అటవీ అధికారులు అధికారికంగా స్వీకరించారు. దేవా, కృష్ణ, అభిమన్యు, మహేంద్ర అనే పేర్లు కలిగిన కుంకీ ఏనుగులను ఆంధ్ర ప్రదేశ్‌కు అప్పగించారు. కర్నాటకకు చెందిన మావటీలు రెండు నెలలపాటు కుంకీ ఏనుగులతో ఉండి ఆంధ్ర ప్రదేశ్‌లో మావటీలకు వాటి సంరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆంధ్ర ప్రదేశ్ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో మరిన్ని ఏనుగులు ఇవ్వడానికి సిద్ధమని ఈ సందర్భంగా కర్నాటక సీఎం సిద్ధరామయ్య చెప్పారు. కర్నాటక ఇచ్చిన కుంకీ ఏనుగుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షిస్తానని పవన్ కల్యాణ్ వారికి హామీ ఇచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు.

జీవితాంతం అండగా ఉంటాం

బాలకోటిరెడ్డి కుటుంబానికి లోకేశ్ భరోసా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీ కోసం త్యాగాలు చేసిన కుటుంబాలకు పెద్దకొడుకులా అండగా ఉంటానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇటీవల హత్యకు గురైన టీడీపీ పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని తన ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాలకోటిరెడ్డి భార్య నాగేంద్రమ్మ, బాలకోటిరెడ్డి సోదరుని కుమారులు నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డిని కలిశారు. హత్య కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయనను బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా నష్టపోయామని, ఉపాధి హామీ, గృహ నిర్మాణం బిల్లులు పెండింగ్ ఉన్నాయని, ఇల్లు తాకట్టులో ఉందని వారు చెప్పగా... జీవితాంతం అండగా ఉంటానని లోకేశ్ భరోసా ఇచ్చారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం, తాకట్టు నుంచి ఇల్లు విడిపిస్తామని అన్నారు. బాలకోటి రెడ్డి హంతకులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని వారికి లోకేశ్ హామీ ఇచ్చారు.

హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అధ్వర్యంలో జూన్ 27, 28, 29 తేదీల్లో గుంటూరు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఏఐ హ్యాకథాన్ పోస్టరును డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా బుధవారం ఆవిష్కరించారు. ఇది ఆవిష్కరణలను పెంపొందించడం, పోలీసింగ్, ప్రజా సేవా బట్వాడాను గణనీయంగా పెంచే ఆధారిత పరిష్కారాలను గుర్తించడం లక్ష్యంగా నిలుస్తుంది. గవర్నెన్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడాన్ని నొక్కి చెప్పిన సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా ఈ చొరవ నిర్వహించ బడుతోంది. చట్టం అమలు, ప్రజా పరిపాలనలో వాస్తవ ప్రపంచ సవాళ్లను ఏఐ ఎలా ఎదుర్కోగలదో ప్రదర్శించడానికి ఈ హ్యాకథాన్ ఒక వ్యూహాత్మక వేదికగా ఉపయోగపడుతుందని డీజీపీ తెలిపారు.ఈ హ్యాకథాన్ ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంగా ఉంటుందని భావిస్తున్నామని, దీనికి సీఎం చంద్రబాబుతోపాటు రాష్ట్ర మంత్రులు, అధికారులు హాజరవుతారన్నారు.

గంగమాంబ అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

విశాలాంధ్ర-కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పంలో జరుగుతున్న శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మ వారి జాతర సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు ప్రభుత్వం, టీటీడీ తరపున అమ్మ వారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం పూజారులు సీఎం దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బుధవారం మధ్యాహ్నం అమ్మవారి జాతర నిమిత్తం కుప్పంకు విచ్చేసిన సీఎం దంపతులు అమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం,ఆలయ చైర్మన్ రవిచంద్రబాబు వారికి స్వాగతం పలికారు. ఏడాదికి ఒకసారి మాత్రమే లభించే గంగమ్మ విశ్వరూప దర్శనం చేసుకుని, రాష్ట్రాన్ని గంగమ్మ చల్లంగా చూడాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

'విశాఖ ఉక్కు' ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా

షర్మిల నిరవధిక నిరాహారదీక్ష

తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేసే ఒప్పంద కార్మికులను తొలగించడం అన్యాయమని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వారందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమం ఉగ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు. ఒప్పంద కార్మికుల సమ్మెకు మద్దతుగా ఆమె బుధవారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. తొలుత కూర్మన్న పాలెం కూడలిలోని దీక్షా శిబిరానికి వెళ్లి, కార్మికులకు సంఘీభావం తెలిపారు. తొలగించిన రెండు వేల మందిని విధుల్లోకి తీసుకోవాలని యాజమాన్యాన్ని షర్మిల డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ యత్నాలతో విశాఖ ఉక్కు కష్టాల్లో పడిందని, ప్రధాని మోదీకి మిత్రులైన అదానీ, అంబానీకి కర్మాగారాన్ని కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. కాంగ్రెస్ ఎప్పుడు కార్మికుల పక్షాన్నే నిలుస్తుందని భరోసానిచ్చారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని మరువరాదన్నారు. విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసినది, కష్టాల్లో ఉన్నప్పుడు ఆర్థికంగా ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీనని షర్మిల గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 34 వేల మందిగా ఉండే కార్మికుల సంఖ్య ప్రస్తుతం 20 వేలకు తగ్గిందని, గత 11 ఏళ్లలో అకారణంగా వేల మందిని తొలగించారన్నారు. 'విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు ఇవ్వకుండా, సెయిల్‌లో విలీనం చేసేందుకు నిర్లక్ష్యం వహిస్తున్న మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం... సంస్థ నిర్వీర్యానికి కుట్రలను తిప్పికొడతాం' అని వక్కాణించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ఉండివుంటే రాష్ట్రానికి క్యాప్టివ్ మైన్స్ వచ్చేవని తన తండ్రిని గుర్తుచేశారు. అలాగే, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి నేపథ్యంలో ఆయనకు షర్మిల నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, రాజశేఖర్, నర్సింగరావు, కార్మిక నాయకులు గణపతి రెడ్డి, నమ్మి రమణ, రవి, భాస్కర్, అప్పారావు, కార్పొరేటర్ బి.గంగారామ్, కాంగ్రెస్ నాయకుడు జెర్రిపోతుల ముత్యాలు, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, ఉక్కు కర్మాగారం ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీకి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈనెల 20వ తేదీ అర్ధరాత్రి..ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన విధివిధానాల జీవో 22 విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులు ఐదేళ్లు, ఉపాధ్యాయులు ఎనిమిదేళ్లు సర్వీసు పూర్తయితే తప్పనిసరిగా బదిలీ కావాలి. కేటగిరి 1కి ఒక పాయింట్, కేటగిరి 2కి రెండు పాయింట్లు, కేటగిరి3కి మూడు పాయింట్లు, కేటగిరి4కి ఐదు పాయింట్లు, ఐదు స్టేషన్ పాయింట్లు ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో వివరించారు. సర్వీస్ పాయింట్లు ఏడాదికి 0.5గా పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ నాటికి ఖాళీలు, పదవీ విరమణ చేసే స్థానాలు, హేతుబద్ధీకరణ ఖాళీలు, తప్పనిసరిగా బదిలీ అయ్యే స్థానాలు, ఏడాదికిపైగా గైర్హాజరైన టీచర్ల ఖాళీలు, స్టడీ లీవ్ ఖాళీలను చూపించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. అటు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో ప్రభుత్వ చర్చల అనంతరం నేడు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఈ బదిలీల జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో కొన్ని అసంబద్ధాలను తొలగించాలని, అవసరమైన మార్పులను తేవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని తొలగించబోం

మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులెవరినీ తొలగించబోమని, అలాగే వాటి సంఖ్యను తగ్గించే ఆలోచన ప్రభుత్వానికి లేదని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాలు, సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌కు ఇటీవల జీవో జారీ చేశామని, సచివాలయాల ద్వారా రియల్ టైంలో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించే విధంగా వాటిని తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందుకుగాను సచివాలయాలను ఎ...బి...సి... మూడు కేటగిరీలుగా విభజించామని, దాని ప్రకారం సిబ్బందిని సర్దుబాటు చేస్తామన్నారు. 2500 జనాభా గల గ్రామ సచివాలయంలో ఆరుగురు సిబ్బంది, 2500 నుంచి 3000 జనాభా గల సచివాలయాల్లో ఏడుగురు, 3 వేలకు పైబడి జనాభా గల సచివాలయాల్లో 8 మంది సిబ్బంది ఉండేలా విభజించామని వివరించారు. క్లస్టర్ విధానాన్ని అనుసరిస్తామని, అందుకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసిన తర్వాత వారిని బదిలీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత సాధారణ బదిలీల సమయంలో సచివాలయాల సిబ్బంది బదిలీల ప్రక్రియను చేపట్టబోమని వివరించారు. ప్రస్తుతం కొన్ని సచివాలయాల్లో 10 మంది వరకు సిబ్బంది ఉండగా కొన్నిచోట్ల ముగ్గురు నలుగురు సిబ్బందితో అవి నడుస్తున్నాయని చెప్పారు. త్వరలో మూడు అంచెల విధానాన్ని అమలులోకి తీసుకురానున్నట్టు మంత్రి వీరాంజనేయస్వామి వెల్లడించారు. అనగా జిల్లా, మండల, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్లానింగ్ బోర్డులు ఏర్పాటు చేసి జిల్లా స్థాయిలో జిల్లా అధికారి, మండల స్థాయిలో ఎంపీడీవో, నియోజకవర్గ స్థాయిలో ఒక అధికారికి కొంతమంది సిబ్బందిని ఇచ్చి వారి ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల పని తీరును నిరంతరం పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.